# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :275 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 14-01-2026 | పేజీలు:4 వెల: 2.00


## మాజీ బిఆర్ఎస్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి షాక్

జనగామ, జనగామ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి చెందిన రూ. 5కోట్ల విలువైన ఆస్తులను ఐటీ అధికారులు అటాచ్ చేశారు. బినామీ యాక్ట్ కింద సిద్ధిపేట, జనగామలో ఆయనకు చెందిన పలు విలువైన ఆస్తులను అటాచ్ చేస్తూ ఐటీ అధికారులు సోమవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో తన కుమార్తె తుల్జా భవానీ రెడ్డి పేరు మీద జనగామ, సిద్ధిపేటలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పలు భూములు కొనుగోలు చేశారు. దీనిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఐటీ అధికారులు రంగంలోకి దిగి.. ఆ దిశగా విచారణ చేపట్టారు. తన కుమార్తెను బినామీగా పెట్టి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భారీగా భూములు కొనుగోలు చేసినట్లు ఐటీ అధికారులకు పలు ఆధారాలు లభ్యమయ్యాయి. ఆ క్రమంలో ఈ భూముల కొనుగోలుపై యాదగిరిరెడ్డి కుమార్తె తుల్జా భవానీరెడ్డిని విచారించారు. ఈ భూములు కొనుగోలు చేసేందుకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందంటూ తుల్జా భవానీ రెడ్డిని ఐటీ అధికారులు ప్రశ్నించారు. ఆ న గదు ఎక్కడి నుంచి వచ్చిందో తనకు తెలియదని ఐటీ అధికారులకు ఆమె వెల్లడించింది. తన తండ్రి సంతకం పెట్టమని చెబితేనే.. తాను ఈ భూములకు చెందిన సీల్ డీడ్‌పై సంతకం చేశానంటూ ఐటీ

## జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్.. ఆ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన!



హైదరాబాద్,మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనలకు స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఖరారైంది. ఈసారి పర్యటనను త్రిముఖ వ్యూహంతో నిర్వహించనున్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, అలాగే ఉపాధి హామీ పథకం అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన సభలు నిర్వహించడమే ఈ వ్యూహంలోని ప్రధాన అంశాలు. ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వారీగా రెండు దఫాల పర్యటన షెడ్యూల్‌ను సీఎం ఖరారు చేశారు. బహిరంగ సభలతో పాటు వీలున్న చోట్ల కార్నర్ మీటింగ్లు నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు.

జనవరి 16 నుంచి తొలి విడత పర్యటన

మొదటి విడత జిల్లాల పర్యటనను ఈ నెల 16 నుంచి ప్రారంభించనున్నారు. జనవరి 16, 17, 18 తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో సీఎం పర్యటించనున్నారు. ఈ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నారు. నిర్మల్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలకు కూడా హాజరవుతారు. జనవరి 16న నిర్మల్‌లో, 17న జడ్చర్లలో, 18న పాలేరుఉఖమ్మం ప్రాంతంలో సీఎం పర్యటన కొనసాగనుంది. అదే సమయంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని కూడా వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు.

విదేశీ పర్యటన షెడ్యూల్

జనవరి 19న సీఎం మేడారం వెళ్లనున్నారు. అనంతరం అదే రోజు సింగపూర్, అమెరికా దేశాల పర్యటనకు బయలుదేరనున్నారు. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. మరుసటి రోజు పరిస్థితిని బట్టి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఫిబ్రవరి 3 నుంచి మలి విడత

ఫిబ్రవరి 3 నుంచి రెండో విడత జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ విడతలో ఆరు రోజుల పాటు ఆరు ఉమ్మడి జిల్లాల్లో సీఎం పర్యటించనున్నట్లు సీఎంవో వర్గాలు వెల్లడించాయి. వరుసగా నల్లగొండ, కరీంనగర్, రంగారెడ్డి, వరంగల్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో కూడా తొలి విడత తరహాలోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, అధికారిక కార్యక్రమాలు, పార్టీ కార్యకర్తలతో సమావేశాలు ఉంటాయి. కార్నర్ మీటింగ్లు, బహిరంగ సభల ద్వారా మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనున్నారు.

ఉపాధి హామీపై నిరసన సభలు

ఉపాధి హామీ పథకం విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ సభలను విజయవంతం చేయాల్సిన బాధ్యతను స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఆయా జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులకు టీపీసీసీ అప్పగించనుంది.అయితే రెండో విడతలో చివరి రోజుల్లో సీఎం వెళ్లే మెదక్, నిజామాబాద్ జిల్లాలకు సంబంధించిన షెడ్యూల్ ఇంకా పూర్తిస్థాయిలో ఖరారు కావాల్సి ఉందని సమాచారం. మొత్తం మీద మున్సిపల్ ఎన్నికలకు ముందు జిల్లాల పర్యటనలతో రాజకీయంగా పూర్తి స్థాయిలో కదలిక తీసుకురావడమే సీఎం వ్యూహంగా కనిపిస్తోంది.

## ముట్టుకుంటే అగ్గి పుడుతుంది... బీఆర్ఎస్ మరో సెంటిమెంట్ వార్ !

హైదరాబాద్,తెలంగాణలో మరో రాజకీయ యుద్ధానికి తెర లేవనుందా అంటే జరుగుతున్న పరిణామాలు అవును అని అంటున్నాయి. ఇప్పటికే నీటి విషయంలో అధికార కాంగ్రెస్ విపక్ష బీఆర్ఎస్ ల మధ్య జల జగడం సాగుతోంది. క్రిష్ణ గోదావరి నీటి వాటా విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది అని బీఆర్ఎస్ గట్టిగా విమర్శిస్తోంది. ఈ విషయంలో అధికార కాంగ్రెస్ అసమర్ధంగా వ్యవహరిస్తోంది అని కూడా చెబుతోంది. ఆ వేడి అలా కొనసాగుతుండగానే దానికి జత అన్నట్లుగా మరో ఇష్యూని బీఆర్ ఎస్ చేతుల్లోకి తీసుకునేట్లుగా సీన్ కనిపిస్తోంది.



జిల్లా పునర్విభజన :

తెలంగాణ లో జిల్లాల పునర్ విభజన అన్నది ఇపుడు రాజకీయంగా కాక రేపేలా కనిపిస్తోంది. తెలంగాణాలో 33 జిల్లాలు ఉన్నాయి. వాటి విషయంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తోంది ఈ జిల్లాలను తగ్గించాలని శాస్త్రీయ దృక్పథంతో రూపురేఖలు తీసుకుని రావాలని ఆలోచన చేస్తున్నట్లుగా ప్రచారం అయితే సాగుతోంది దాని మీద అధికార ప్రకటన కూడా వెలువడింది. ఇక రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అయితే కేసీఆర్ ఏలుబడిలో జిల్లాల విభజన అన్నది పూర్తి అసాశ్త్రీయంగా సాగింది అని విమర్శించారు. అందుకే తాము అవసరమైన మేర్కు జిల్లాలను తగ్గించి అవసరం లేని వాటిని తొలగిస్తామని కూడా చెప్పుకొచ్చారు. దీంతో ఇపుడు బీఆర్ఎస్ స్ట్రాంగ్ గా రియాక్ట్ అవుతోంది.

అగ్గి పుట్టిస్తామంటూ :

జిల్లాల విషయంలో ఏమైనా తేడా పాడా చేయాలనుకున్నా వాటి జోలికి వచ్చినా అగ్గి పుట్టిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే గట్టిగానే రియాక్ట్ అయ్యారు. తెలంగాణాలో అగ్గి పుట్టించే ఈ బాధ్యతను కూడా బీఆర్ ఎస్ తీసుకుంటుందని ఆయన స్పష్టం చేయడం విశేషం. తాజాగా ఆయన మహబూబ్ నగర్ జిల్లా బీఆర్ఎస్ సర్పంచులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఘాటు హెచ్చరికలు జారీ చేశారు.

కేసీఆర్ చేసింది రైటు :

అంతే కాకుండా కేసీఆర్ చేసింది రైటు అని కేటీఆర్ చెప్పడం విశేషం. రాష్ట్రంలో మొత్తం 10 జిల్లాలు ఆనాటికి ఉండేవని వాటిని 31గా చేశారు అని ఇదంతా పాలనాపరమైన సౌకర్యం కోసమే అని ఆయన చెప్పారు. అలాగే పెద్ద జిల్లాగా ఉన్న మహబూబ్ నగర్ ని నాలుగు జిల్లాలుగా చేశారని ఆయన గుర్తు చేశారు ఇల తండాలలో పాలన వారికే ఉండాలని తండాల వాసుల చేతిలో పాలన పెట్టేందుకు వాటిని గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కూడా కేసీఆర్ దే అని ఆయన నొక్కి చెప్పారు.

వారంతా ఊరుకుంటారా :

జిల్లాలను తాము పెంచామని కొత్తగా అనేక ప్రాంతాలకు అవకాశం ఇచ్చామని చెప్పారు. ఇపుడు కొత్త జిల్లాలను తీసేస్తే వారు ఊరుకుంటారా అని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు. ఇక కొత్త జిల్లాల విషయంలో ఏది ముట్టుకున్నా అగ్ని గుండమే అవుతుందని కూడా అంటున్నారు. జిల్లాల జోలికి దయచేసి రావద్దు అని ఆయన అ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. ఒకవేళ కనుక వస్తే మాత్రం ఉద్యమాలకు బీఆర్ఎస్ శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు. ఇవన్నీ పిచ్చి పనులుగా పొరపాట్లుగా కేటీఆర్ అంటున్నారు. మొత్తం మీద చూస్తే పార్లమెంట్ సీట్ల ప్రాతిపదికన మొత్తం 33 జిల్లాలను 17 జిల్లాలుగా కుదించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది అన్నది ప్రచారంలో ఉంది. అయితే అలా చేస్తే తాము ఉద్యమిస్తామని బీఆర్ఎస్ చెబుతోంది. మరి ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది.

## మున్సిపల్ పోరుకు లైన్ క్లియర్.. ఖరారైన బీసీ రిజర్వేషన్‌లు..

హైదరాబాద్,తెలంగాణలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లను ఖరారు చేస్తూ బీసీ డెడికేటెడ్ కమిషన్ ప్రభుత్వంకు కీలక నివేదికను సమర్పించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫారసుల ప్రకారం మొత్తం 50 శాతం రిజర్వేషన్లలో ఎస్సీ, ఎస్టీ కోటాను మినహాయించిన తరువాత మిగిలిన రిజర్వేషన్లను బీసీలకు కేటాయించాలని సూచించింది. పట్టణ ప్రాంతాల్లో గ్రామాలతో పోల్చితే ఎస్సీ, ఎస్టీ జనాభా తక్కువగా ఉన్న నేపథ్యంలో వారికి కలిపి 15 శాతానికి పైగా రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలుస్తోంది.బీసీలకు మాత్రం 34 శాతానికి పైగా రిజర్వేషన్లు కల్పించాలని కమిషన్ స్పష్టంగా పేర్కొన్నట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లను ఒకటి, రెండు రోజుల్లో ఖరారు చేసే అవకాశం ఉంది. అనంతరం తుది వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి పురపాలక శాఖ అందజేయనుంది.ఇదిలా ఉండగా, రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 117 మున్సిపాలిటీలు, ఆరు కార్పొరేషన్లలో మొత్తం 52,42,993 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది.వీరిలో 25,62,358 మంది పురుష ఓటర్లు కాగా, 26,80,005 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతర ఓటర్ల సంఖ్య




630గా ఎన్నికల సంఘం ప్రకటించింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా తుది ఓటర్ల జాబితా ఇప్పటికే ప్రచురితమైంది.బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పణతో పాటు ఓటర్ల తుది జాబితా విడుదల కావడంతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం త్వరలోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## భారత్‌పై మరో 25 శాతం సుంకం తప్పదా?



వాషింగ్టన్: ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25 శాతం టారిఫ్ విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం భారత్‌పై ఏ మేర ప్రభావం చూపిస్తుందనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే రష్యాతో చమురు కొనుగోళ్ల కారణంగా 50 శాతం సుంకాలు విధిస్తామనే హెచ్చరికలు ఎదుర్కొంటున్న ఈ తరుణంలో.. తాజా నిర్ణయం మరో ఆర్థిక ఒత్తిడే అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఇరాన్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా చైనా ఉన్నప్పటికీ.. భారత్ కూడా కీలకమే. భారత రాయబార కార్యాలయం (టెహ్రాన్) గణాంకాల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇరాన్‌కు భారత్ 1.24 బిలియన్ డాలర్ల విలువైన సరుకులను ఎగుమతి చేసింది. అదే సమయంలో ఇరాన్ నుంచి 0.44 బిలియన్ డాలర్ల సరుకులను దిగుమతి చేసుకుంది. అంటే గత ఆర్థిక సంవత్సరంలో ఇరు దేశాల మధ్య మొత్తం 1.68 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. భారత కరెన్సీలో చెప్పాలంటే.. ఇది సుమారు రూ.14వేల కోట్ల నుంచి 15 వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా.భారత్ నుంచి ఇరాన్‌కు వెళ్లిన ఎగుమతుల్లో ఆర్గానిక్ కెమికల్స్ అగ్రస్థానంలో ఉన్నాయి. వీటి విలువ 512.92 మిలియన్ డాలర్లు. అలాగే పండ్లు, డ్రైఫ్రూట్స్, సిట్రస్ పండ్ల తొక్కలు, మెలాన్లు వంటి వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి 311.60 మిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతోంది. ఖనిజ ఇంధనాలు, ఆయిల్స్, డిస్టలేషన్ ఉత్పత్తులకు సంబంధించి 86.48 మిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతోంది. ఒకవేళ ఈ రంగాలపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం పడితే, భారత ఎగుమతిదారులకు నష్టాలు తప్పవని వ్యాపారవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే 50 శాతం టారిఫ్!

రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికే భారత ఉత్పత్తులపై అమెరికా 50 శాతం వరకు టారిఫ్‌లు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇరాన్ వ్యాపారంపై కూడా అదనపు టారిఫ్‌లు విధిస్తే.. అమెరికా ఉ భారత్ వాణిజ్య చర్చలు మరింత ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. గత కొన్ని నెలలుగా టారిఫ్‌ల సడలింపు కోసం ఇరు దేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఇలాంటి తరుణంలో ట్రంప్ తాజా నిర్ణయం ఆ ప్రయత్నాలకు ఆటంకంగా మారవచ్చని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ట్రంప్ విధిస్తున్న గ్లోబల్ టారిఫ్‌ల చట్టబద్ధతపై అక్కడి అత్యున్నత న్యాయస్థానంలో కేసు కొనసాగుతోంది. ఈ కేసులో బుధవారం తీర్పు వెలువడనుంది. ఒకవేళ ట్రంప్‌నకు వ్యతిరేకంగా తీర్పు వస్తే.. ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై తక్షణమే టారిఫ్‌లు విధించే అధికారాలు పరిమితమయ్యే అవకాశం ఉంది.

## వివేకా హత్య కేసు.. సుప్రీంకోర్టులో సునీత మరో అప్లికేషన్



న్యూఢిల్లీ,మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు లో ఆయన కుమార్తె సునీత సుప్రీంకోర్టులో మరో అప్లికేషన్ దాఖలు చేశారు. సీబీఐ విచారణ కొనసాగింపునకు ట్రయల్ కోర్టు పాక్షకంగా అనుమతివ్వడాన్ని సవాల్ చేస్తూ ఆమె సుప్రీంను ఆశ్రయించారు. సీబీఐ విచారణ అంశంపై నిర్ణయం తీసుకోవాలని హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టును గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. మూడు నెలల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. కేవలం ఇద్దరి పాత్రపై మాత్రమే విచారణ జరపాలని పాక్షకంగా ఆదేశాలు ఇచ్చింది. తాము లేవనెత్తిన అంశాలకు విరుద్ధంగా పాక్షక విచారణకు ట్రయల్ కోర్టు ఆదేశాలిచ్చిందని.. ధర్మాసనం ఇచ్చిన మార్గదర్శకాలను పట్టించుకోలేదని సుప్రీంకోర్టు దృష్టికి సునీత తీసుకెళ్లారు. దీంతో ప్రస్తుత అప్లికేషన్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పిటిషన్లపై విచారణను అత్యున్నత న్యాయస్థానం వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

## మేడారంలో కేబినెట్ భేటీ... రేవంత్ మార్క్ అంతే !

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో సంచలన నిర్ణయానికి సిద్ధమవుతున్నారు. సాధారణంగా సచివాలయంలో జరిగే మంత్రివర్గ సమావేశాన్ని, ఈ నెల 18న వనదేవతల నెలవైన మేడారంలో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. సంప్రదాయానికి భిన్నంగా తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. షెడ్యూల్ ప్రకారం, 18వ తేదీ ఉదయం ఖమ్మం నగరంలో మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న అనంతరం, మధ్యాహ్నం రేవంత్ రెడ్డి మేడారం చేరుకుంటారు. అక్కడే కేబినెట్ భేటీ నిర్వహించి, రాత్రికి వనదేవతల సన్నిధిలోనే బస చేయనున్నారు.

ప్రజల మధ్య మంత్రివర్గ సమావేశం

రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం ద్వారా తనదైన రాజకీయాన్ని ప్రదర్శించబోతున్నారు. గత పదేళ్లలో కేబినెట్ సమావేశాలు కేవలం ప్రగతి భవన్ లేదా సచివాలయం వంటి మూసి ఉన్న గదులకే పరిమితమయ్యాయి. ఇప్పుడు మేడారం వంటి అత్యంత ప్రాముఖ్యత కలిగిన పుణ్యక్షేత్రంలో కేబినెట్ నిర్వహించడం ద్వారా, తమ ప్రభుత్వం ప్రజల చెంతకే పాలన ను తీసుకెళ్తోందనే సంకేతాలను ఆయన బలంగా పంపిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంత సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి, మేడారం జాతర ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించడానికి ఈ పర్యటన దోహదపడుతుందని భావిస్తున్నారు.

ముున్సిపల్ ఎన్నికలకు ముందు కొత్త వ్యూహం

మున్సిపల్ ఎన్నికల ప్రచార వేడిలో ఉన్న తరుణంలో ఖమ్మం సభ ముగించుకుని నేరుగా మేడారం వెళ్లడం ద్వారా రేవంత్ రెడ్డి తన పనితీరును కూడా ప్రజల ముందు ఉంచుతున్నారు. తెలంగాణ భౌగోళిక, సాంస్కృతిక అంశాలను మేళవిస్తూ ఆయన వేస్తున్న అడుగులు రేవంత్ ఒక ప్రత్యేక శైలి ఉన్న నాయకుడని చాటిచెబుతున్నాయి. మేడారం కేబినెట్‌లో గిరిజన సంక్షమం లేదా ప్రాంతీయ అభివృద్ధిపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



గతంలో పలువురు ముఖ్యమంత్రులదీ ఇదే వ్యూహం

గతంలో కొందరు ముఖ్యమంత్రులు కూడా ఇలాగే రాజధానికి వెలుపల కేబినెట్ సమావేశాలు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయనగరంలో జిల్లా కలెక్టర్ల సమావేశంతో పాటు కేబినెట్ భేటీ నిర్వహించగా, ఏపీ విభజన తర్వాత అమరావతి నిర్మాణం కోసం బస్సులోనే కేబినెట్ భేటీ జరిపి రికార్డు సృష్టించారు. అటు ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రయాగ్‌రాజ్ కుంభమేళా సందర్భంగా అక్కడే కేబినెట్ నిర్వహించగా, మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ సైతం నర్మదా నది ఒడ్డున మంత్రులతో భేటీ అయ్యారు. ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం అజిత్ జోగి ఏకంగా అడవిలో టెంట్లలో కేబినెట్ మీటింగ్ పెట్టి వార్తల్లో నిలిచారు. ఇప్పుడు రేవంత్ ఆ జాబితాలో చేరుతున్నారు.

## గాదె ఇన్నయ్య అనాథశ్రమంలో ఎన్ఐఏ సోదాలు.. వాటిపై ఫోకస్..

జనగామ జిల్లా, సామాజిక ఉద్యమకారుడు గాదె ఇన్నయ్యకు చెందిన జాఫర్‌ఘడ్ ప్రాంతంలోని మాఇల్లు అనే పేరుతో ఉన్న అనాథశ్రమంలో (మంగళవారం) ఉదయం నుంచి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఎన్ఐఏ సిబ్బందితో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. అనాథశ్రమంలో మంగళవారం ఉదయం నుంచే ఎన్ఐఏ అధికారులు బృందాలుగా విడిపోయి.. ఆశ్రమంలోని రికార్డులు, కంప్యూటర్లు, ఇతర పత్రాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఎన్ఐఏ సోదాలు చేస్తుండటంతో మీడియా ఆ ప్రాంతానికి చేరుకుంది. అయితే సోదాలు జరుగుతున్న సమయంలో సమాచారం బయటకు రాకుండా మీడియాను లోపలికి అనుమతించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

ఇన్నయ్య అరెస్ట్, కేసు వివరాలు..

ఇన్నయ్యను ఎన్ఐఏ ఇప్పటికే అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆయనపై ఉపా చట్టం కింద కేసు నమోదు చేశారు. రిమాండ్‌లో ఉన్న ఇన్నయ్యను ఎన్ఐఏ విచారిస్తోంది. ఈ విచారణలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.




విచారణలో భాగంగానే ఇన్నయ్యకు సంబంధించిన అనాథశ్రమంలో జరిగే కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు తదితరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. జనగామ జిల్లా జాఫర్‌గఢ్‌లో జరుగుతున్న ఈ పరిణామాలు సంచలనం రేపుతున్నాయి. ఎన్ఐఏ అధికారులు ఒక అనాథశ్రమంపై దృష్టి సారించడం, 'ఉపా' చట్టం కింద చర్యలు తీసుకోవడం ఈ కేసు తీవ్రతను తెలియజేస్తోంది.

## సంపాదకీయం

బుధవారం 14-01-2026

# భోగాపురం విమానాశ్రయంపై వాదులాటా!

విశాఖపట్నానికి 45 కిలోమీటర్ల దూరంలో భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి ఫ్లైట్ ల్యాండింగ్‌తో ట్రైల్ రన్ నిర్వహించారు. దీనికి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించినట్లు, చంద్రబాబు దార్శనికతకు ఇది నిదర్శనమని భారీ ప్రచారం చేస్తున్నది. దీనికి ప్రతిగా భోగాపురం విమానాశ్రయ నిర్మాణం జగన్మోహన్ రెడ్డి కృషి ఫలితమేనని, 2019 ఎన్నికలకు ముందు ఎటువంటి అనుమతులు లేకుండానే చంద్రబాబు శంకుస్థాపన చేశారని, ఇప్పుడు జగన్ కృషితో నిర్మాణం పూర్తవుతున్న విమానాశ్రయాన్ని చంద్రబాబు తన ఖాతాలో వేసుకొని క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని విమర్శిస్తున్నారు. టిడిపి కూటమికి, వైసిపి లకు కొమ్ము కాస్తున్న ప్రధాన మీడియా ప్రధాన శీర్షికలతో రెండు పాలక పక్షలను ఆకాశానికెత్తుతున్నాయి. ఉత్తరాంధ్రకు వీరు చేస్తున్న ద్రోహాన్ని కప్పి పుచ్చుతూ భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర దశ, దిశను మార్చేస్తుందని, ఇక అభివృద్ధి పరుగులు పెడుతుందని ప్రజలను మోసం చేస్తున్నాయి. భోగాపురం విమానాశ్రయం బాగోతం చూస్తే తెలుగుదేశం కూటమి, వైసిపి పార్టీలు ఎలా ద్రోహం చేస్తున్నాయో సులభంగా అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర విభజన అనంతరం భోగాపురం విమానాశ్రయాన్ని 2015లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు తెర మీదికి తెచ్చారు. బిజెపితో కలిసి చకచకా పావులు కదిపి భోగాపురంలో విమానాశ్రయాన్ని నిర్మించేందుకు అనుమతులు పొందారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి)లో దీనిని నిర్మించాలని నిర్ణయించారు. ఆగమేఘాల మీద 5311 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ జారీచేశారు. 2017 జులైలో టెండర్లను ఆహ్వానించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎ.ఎ.ఐ) తోపాటు జి.ఎం.ఆర్ రెండు సంస్థలు టెండర్లలో పాల్గొన్నాయి. జివికె, ఎస్సెల్ సంస్థలు టెండర్ల నుండి వైదొలిగాయి. జి.ఎం.ఆర్ సంస్థ ఎయిర్ పోర్టు ఆదాయంలో 21.6 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తుందని టెండర్లో కోట్ చేసింది. ఎఎఐ ఎయిర్ పోర్టు ఆదాయంలో 30.2 శాతం వాటాతో పాటు ఎయిర్ పోర్టులో 26 శాతం ఈక్విటీ హక్కు గ్యారంటీ రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తామన్నారు. అంతేగాక ఎకరానికి రూ.20 వేలు చొప్పున లీజు కింద ఏడాదికి మొత్తం భూమికి రూ.5.40 కోట్లు కూడా చెల్లిస్తామని, ప్రతి ఏడాది లీజును 6 శాతం పెంచుతామని టెండర్‌లో పేర్కొన్నారు. అంతిమంగా ఎల్-1గా ఎఎఐ టెండర్‌ను దక్కించుకుంది. 2017 డిసెంబర్ 20న అప్పటి భోగాపురం అంతర్జాతీయ విమానశ్రయ అభివృద్ధి కార్పొరేషన్ బోర్డు ఎఎఐ టెండర్‌ను ఆమోదించింది. సాధికార కమిటీ కూడా అంగీకరించి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని ఎఎఐకి ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎఎఐకి భోగాపురం ఎయిర్ పోర్టు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఇష్టం లేదు. ఆగమేఘాల మీద 2018 జనవరి 20న క్యాబినెట్ సమావేశం జరిపి ఎల్-1గా వచ్చిన ఎఎఐ టెండర్‌ను చట్ట విరుద్ధంగా రద్దు చేశారు. కేవలం జిఎంఆర్‌కి ఇవ్వాలనే దురుద్దేశంతో ఈ చర్యకు పాల్పడ్డారు. ఎఎఐ సంస్థ టెండర్ రద్దుకు కొత్త కారణాలు చెప్పారు. మొదటి టెండర్లలో ఏరో సిటీ, ఏవియేషన్ అకాడమీ నిర్మాణాలు లేవని అందుకే రద్దు చేశామని చెప్పారు. వీటితో కలిపి కొత్తగా టెండర్లు పిలుస్తామని సమర్థించుకున్నారు. వాస్తవంగా ఏరో సిటీ మొదటి టెండర్లో లేకపోయినా ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఎటువంటి ఆటంకం ఉండదు. ఏరో సిటీ అంటే షాపింగ్ మాల్స్, స్టార్ హోటళ్లు, ఫుడ్ కోర్టులు తదితరమైనవి ఎయిర్ పోర్టు పక్కన నిర్మించటం. అలాగే ఏవియేషన్ అకాడమీ అంటే ఎయిర్ పోర్టు నిర్వహణకు అవసరమయ్యే వారికి శిక్షణ ఇచ్చే కేంద్రం. ఈ రెండింటికి 70 ఎకరాలు స్థలం కేటాయిస్తే ఎక్కువ. కాని ఈ సాకు చెప్పి ఎఎఐ సంస్థకి ఇచ్చిన టెండరును కుట్రతో రద్దు చేశారు. రెండోసారి పిలిచిన టెండర్ల ప్రీ బిడ్డింగ్ సమావేశం 2018 ఆగస్టు 6న విశాఖపట్నంలో జరిగింది. స్టార్ హోటళ్లు, జి.ఎం.ఆర్, ఎస్సెల్, జివికె రాంకీలతో పాటు మొత్తం 13 సంస్థలు పాల్గొన్నాయి. ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఎఎఐ పాల్గొనలేదు. ఈ సంస్థను భోగాపురం ఎయిర్ పోర్టు టెండర్‌లో పాల్గొనీయకుండా దేశంలోని బడా పెట్టుబడిదారులు, తెలుగుదేశం, బిజెపి కుమ్మక్కయి కుట్ర చేశాయి. ఎఎఐ సంస్థ టెండర్లలో పాల్గొంటే ప్రైవేట్ సంస్థలు పోటీలో నిలబడగలిగే స్థితి ఉండదు. అందుకే టెండర్ల ప్రక్రియకు ముందే ప్రైవేట్ ఎయిర్ పోర్టు ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కేంద్ర విమానయాన మంత్రిని కలిసి దేశంలో ఎక్కడా కూడా ఎయిర్ పోర్టుల నిర్మాణ టెండర్లలో ఎఎఐని పాల్గొనకుండా నిషేధం విధించాలని కోరారు. దీంతో కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎఎఐని భోగాపురం ఎయిర్ పోర్ట్స టెండర్‌లో పాల్గొనకుండా చేసింది. భోగాపురం ఎయిర్ పోర్టును ఎఎఐ చేపట్టి ఉన్నట్లయితే ఆ ప్రాంతం అభివద్ధికి ఎంతో దోహదపడేది. వేలాదిమందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించబడి ఆ ప్రాంతంలో సేవారంగం వృద్ధి అవటానికి దోహదపడేది. అసంఘటిత రంగం, నిర్మాణ, ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు ప్రాతిపదిక ఏర్పడేది. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా భారీగా ఆదాయం చేకూరేది. చుట్టు పక్కల స్థానిక సంస్థలకు కూడా ఆదాయం పెరిగేది. మౌలిక సదుపాయాల కల్పన మెరుగుదలకు దారితీసేది. రైతులు త్యాగం చేసిన భూముల వల్ల కనీసం ఆ ప్రాంతానికి కొంతైనా మేలు జరిగేది. జిఎంఆర్‌కి ఇవ్వటం వల్ల ఇవన్నీ కోల్పోయాయి. నేడు కనీసం నిర్మాణ పనుల్లో కూడా స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించడంలేదు. అతి తక్కువ వేతనాలకు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను రప్పించుకొని శ్రమ దోపిడి సాగిస్తారు. అరవయ్యేళ్ల పాటు పిపిపి కింద భోగాపురం ఎయిర్ పోర్టు జిఎంఆర్ యాజమాన్యం కింద ఉంటుంది. మొత్తం ప్రాజెక్టు విలువ రూ.4,592 కోట్లుగా అంచనా వేశారు. ఈ నిధులను జి.ఎం.ఆర్ సమకూర్చదు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భారత మౌలిక సదుపాయాల ఫైనాన్స్ కంపెనీ (ఐ.ఐ.ఎఫ్.ఎల్) వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల నుండి సమకూర్చి ఇచ్చింది. ఐ.ఐ.ఎఫ్.ఎల్ సంస్థ కూడా రూ.675 కోట్లు పెట్టుబడి పెట్టింది. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో జి.ఎం.ఆర్ సొంత పెట్టుబడి రూ.100 కోట్లు కూడా లేదు. పైపెచ్చు రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ కింద రూ.134 కోట్లు జి.ఎం.ఆర్ కి ఇస్తున్నది. మొత్తం 2203 ఎకరాల భూమిని ఎయిర్ పోర్టుకి కేటాయించారు. ఇదిగాక మరో 500 ఎకరాలు ఏరో సిటీ, ఏవియేషన్ అకాడమీ పేర ఇచ్చారు. అయితే, జి.ఎం.ఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించేది చూస్తే చాలా ఆశ్చర్యపోతాం. రైతుల భూములను, విమానాశ్రయాన్ని జి.ఎం.ఆర్ కి అడ్డగోలుగా చంద్రబాబు, జగన్‌మోహన్ రెడ్డి ఎలా దోచిపెట్టారో బట్టబయలు అవుతుంది. మొదటి టెండర్‌లో జి.ఎం.ఆర్ ఎయిర్ పోర్టు ఆదాయంలో 21.6 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తామని కోట్ చేసింది. భూమికి ఎకరానికి రూ.20 వేల చొప్పున ప్రతి ఏడాదికి చెల్లిస్తామని కూడా తెలిపింది.

# టీజీఐఐసీ వ్యవహారం వివాదాస్పదం...

హైదరాబాద్, పరిశ్రమలకు అనుమతుల మంజూరీ, భూముల కేటాయింపునకు ఉద్దేశించిన టీజీఐఐసీ సంస్థ ఓ సీక్రెట్ ఏజెన్సీగా మారి, ఏ వివరాలూ బయటకు వెల్లడించడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి దాదాపు 300 కంపెనీలకు అనుమతులు మంజూరు చేసినట్టు ఇటీవల మంత్రి ప్రకటించారు. అవి ఏ కంపెనీలు, వాటికి కేటాయించిన భూములెన్ని అని అధికారులను అడిగితే తెలియదనే సమాధానం వస్తున్నది. అసలు వివరాలు ఎం దుకు రహస్యం గా ఉంచుతున్నారనేది అంతుబట్టడం లేదు. ఓ వైపు సీఎంవో నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన కంపెనీలకే అనుమతులు, భూకేటాయింపులు చేస్తున్నారనే ప్రచారం జరుగుతున్నా అధికారులు సైతం గోప్యత పాటించటంతో ఏదో మతలబు ఉందనే భావన కలుగుతున్నది. ఊరూపేరు లేని కంపెనీలకు అరకొర ధరలపై భూములు ధారాదత్తం చేస్తున్నారా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ రాగానే తలకిందులు

వాస్తవానికి భారీ పెట్టుబడులు, రూ.100కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టే కంపెనీలు నేరుగా ప్రభుత్వంతో చర్చలు జరిపి ఒప్పందం చేసుకుంటాయి. వాటి భూకేటాయింపు, రాయితీ తదితరాలపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుని వివరాలు బయటకు వెల్లడిస్తారు. రూ.100కోట్లకు తక్కువ పెట్టుబడి ఉండే కంపెనీలు నేరుగా టీజీఐపాస్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే టీజీఐఐసీ అధికారులు ప్రాజెక్టు వివరాల ఆధారంగా అనుమతులు, భూ కేటాయింపులు జరుపుతారు. అందులో ప్రభుత్వ ప్రమేయం ఉండ దు. బీఆర్ఎస్ పాలనలో ఈ విధానం ఎంతో పారదర్శకంగా సాగగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి పరిస్థితులు తలకిందులయ్యాయి. ఆన్‌లైన్ విధానం అలంకారప్రాయం కాగా, భూముల కేటాయింపు రహస్యంగా మారిపోతున్నది. ఏ కంపెనీకి ఎంత భూమి కేటాయిస్తున్నారో కనీసం టీజీఐఐసీలోని అధికారులకు కూడా తెలియడం లేదు. సచివాలయంలోని అధికారులు నేరుగా ప్రభుత్వానికి ఫైల్ పంపితే, అక్కడే అన్ని జరుగుతుండగా, కేవలం భూమి అలాట్‌మెంటు సందర్భంలోనే టీజీఐఐసీ అధికారులకు విషయం తెలుస్తున్న ది. టీజీఐఐసీలో చైర్మన్ కార్యాలయం వద్ద తిష్ఠవేస్తున్న సంగారెడ్డి ప్రముఖ కాంగ్రెస్‌నేత అనుచరులు అధికారిక కార్యకలాపాలు స్తంభింపజేశారు. వారికి సీఎంవో నుంచి నేరుగా సంబంధాలు ఉండటంతో టీజీఐఐసీలో వారు చెప్పిం దే వేదంగా మారింది. దీంతో పరిశ్రమల అనుమతులు, భూకేటాయింపులు కోరుతూ వచ్చే ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలనను అధికారులు నిలిపివేశారు. దరఖాస్తులు పరిశీలించినా కాం గ్రెస్ నేత ఏజెంట్ల గ్రీన్‌సిగ్నల్ లేకుండా అనుమతులిచ్చే వీలులేకపోవడంతో ఎందుకొచ్చిన తంటా అనుకొని మిన్నకుంటున్నారు. దీంతో టీజీఐఐసీలో ఆన్‌లైన్ దరఖాస్తులు కుప్పలుగా పేరుకుపోయాయి. డిసెంబర్ చివరినాటికే రెండున్నర వేలకుపైగా దరఖాస్తులు పరిశీలనకు నోచుకోక పెండింగ్‌లో ఉన్నాయంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థంచేసుకోవచ్చు. సహజంగా టీజీఐఐసీకి వచ్చే దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రాజెక్ట్ రిపోర్టులు, వారికున్న అర్హతల ఆధారంగా వారం-వారం ఇంటర్వ్యూలు నిర్వహించి అనుమతులతోపాటు భూముల కేటాయిస్తారు. కాగా, రెండేండ్లలో కేవలం 12సార్లే భూముల కేటాయింపు




ఇంటర్వ్యూలు, అందునా అధికారపార్టీ నేత అనుచరుల నుంచి క్లియరెన్స్ వచ్చిన కంపెనీలను మాత్రమే పిలిచి అనుమతులు, భూకేటాయింపులు జరిపినట్టు ఆరోపణలున్నాయి.

కేటాయింపులు వెల్లడించని సర్కార్

గతంలో ఫార్మాసిటీని ఏర్పాటుచేసిన ప్రాంతంలో ఫ్యూచర్‌సిటీని అభివృద్ధి చేస్తున్నట్టు ఊదరగొడుతున్న కాంగ్రెస్ సర్కార్, అక్కడ యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్సిటీ తోపాటు ఏఐ సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్, స్పోర్ట్స్ హబ్, హెల్త్‌సిటీ, గ్రీన్‌ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ అండ్ జనరల్ ఇండస్ట్రీస్ తదితర కాలుష్యంలేని కంపెనీలు ఏర్పాటు చేయనున్నట్టు చెబుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పలు కంపెనీలతో ఒప్పందాలు కూడా చేసుకున్నది. ఇప్పటివరకు 300 కంపెనీలకు అనుమతులు మంజూ రు చేసినట్టు పేర్కొంటుండగా, ఏ కంపెనీకి ఎంత భూమి కేటాయించారో, ఇచ్చిన రాయితీలు ఏమిటో అనే వివరాలు వెల్లడించడం లేదు. బీఆర్ఎస్ సర్కార్ సైతం వేలాది కంపెనీలకు భూములు కేటాయిస్తూ పారిశ్రామికరంగంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పరిశ్రమలకు భూకేటాయింపు వ్యవహారాన్ని గోప్యంగా ఉంచడంలో ఆంతర్యం ఏమిటో అర్థంకావడంలేదు. వెబ్‌సైట్‌లో సమాచారం అందుబాటులో ఉండదు, అధికారుల ను అడిగితే మౌనం వహిస్తున్నారు. కంపెనీల స్థాపన కోసం భూములు కేటాయించాలని కోరుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులొస్తుంటే, వాటిని పరిశీలించకుండా నేరుగా సీఎంవో ఆదేశాల ప్రకారమే భూములు కేటాయిస్తున్నట్టు పరిశ్రమల వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

గుట్టు తెలుస్తుందనేనా?

ఏ కంపెనీకి ఎంత భూమి ఇవ్వాలో, ఎంత ధర నిర్ణయించాలో, ఎంత మేరకు రాయితీలు ఇవ్వాలో అనే పూర్తి అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. కంపెనీల స్థాయి ఆధారంగా అవసరమైతే ప్రభుత్వం ఉచితంగా భూములు కేటాయించవచ్చు. ఉద్యోగావకాశాలు, ప్రభుత్వానికి భారీగా ఆదా యం వచ్చే కంపెనీలు, లేకుంటే సదరు కంపెనీ ద్వారా అనేక యాన్సిలర్ యూనిట్ల ఏర్పాటుకు అవకాశం కలిగి ఇకోసిస్టం డెవలప్ అవుతుందనే కంపెనీల విషయంలో ప్రభుత్వం ఎంతమేరకైనా రాయితీలు అందించే వీలుంటుంది.

# గ్రీన్‌లాండ్ జోలికొస్తే కాల్చిపడేస్తాం..




గ్రీన్‌లాండ్ మాదే.. అక్కడ అడుగుపెడితే అమెరికా అయినా సరే.. కాల్చిపడేస్తాం! తర్వాత సంగతి తర్వాత అంటోంది డెన్మార్క్. అసలు.. అవతల ఉన్నది అగ్రరాజ్యమని తెలిసినా.. డెన్మార్క్ ఇంత మాస్ వార్నింగ్ ఎలా ఇవ్వగలిగింది. యూఎస్ అంటే.. అస్సలు లెక్క లేదా? హెచ్చరించడం దాకా ఓకే.. అమెరికాని ఎదుర్కొనేదెలా? గ్రీన్‌లాండ్ విషయంలో డెన్మార్క్ ధైర్యమేంటి?

గ్రీన్‌లాండ్ పైన కన్నేస్తే యుద్ధం తప్పదు.. డెన్మార్క్

అమెరికా గనక గ్రీన్‌లాండ్‌ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తే.. ముందుగా కాల్పులు జరుపుతామని డెన్మార్క్ హెచ్చరిస్తోంది. కానీ.. దేనితో? ఇదే.. ఇప్పుడు ప్రపంచ దేశాల్లో మెదులుతున్న ప్రశ్న. 1950ల తర్వాత తొలిసారిగా గ్రీన్‌లాండ్‌పై అమెరికా దాడి చేస్తే.. ముందుగా కాల్చి.. ఆ తర్వాత ప్రశ్నలు అడగాలనే స్టాండింగ్ ఆర్డర్స్.. డెన్మార్క్ దళాలకు ఉన్నాయ్. అయితే.. నిజంగా సైనిక దండయాత్ర గానీ, వెనిజుయెలా లాంటి మిలటరీ ఆపరేషన్ గానీ జరిగినప్పుడు.. డానిష్ ఆర్మీ.. అమెరికా శక్తిని ఎదుర్కోగలదా? అనే వాదన కూడా ఇప్పుడు గట్టిగా వినిపిస్తోంది. ప్రెసిడెంట్ ట్రంప్.. గ్రీన్‌లాండ్‌ని ఏదో రకంగా తమ సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. మంత్రమో.. తంత్రమో.. కుతంత్రమో.. ఏదో రకంగా గ్రీన్‌లాండ్‌పై అమెరికా జెండా ఎగరేయాలనే ఆలోచనతో ఉన్నారు. మరోవైపు.. అమెరికా పరిమాణంలో.. ఒక శాతం కంటే తక్కువే ఉన్న గ్రీన్‌లాండ్‌ని నియంత్రించే డెన్మార్క్.. ఇటు వైపు కన్నేస్తే.. యుద్ధం తప్పదని హెచ్చరిస్తోంది. ఇప్పటికే.. 1952 కోల్డ్ వార్ యుగంలో.. తన దళాలకు జారీ చేసిన ఆదేశాలను కూడా వెనక్కి తీసుకుంది. ముందు కాల్చండి.. తర్వాత ప్రశ్నలు అడగండి అని క్లియర్ డైరెక్షన్ ఇచ్చేసింది. దాంతో.. ట్రంప్ కూడా శరవేగంగా పావులు కదుపుతున్నారు.

డెన్మార్క్ గ్రీన్‌ల్యాండ్‌ను రక్షంచగలదా?

ట్రంప్ దూకుడు.. యూరప్, నాటో కూటమి దేశాల్లో ఉద్రిక్తతలను పెంచింది. అయితే.. అమెరికా గనక సీరియస్‌గా మిలటరీ ఆపరేషన్ చేపడితే డానిష్ సైన్యం యూఎస్ వార్ పవర్‌అబ్రశ్రీశ్రీని తట్టుకోలగదా? అనే ప్రశ్నకు ఆన్సర్ వెరీ సింపుల్. అమెరికాని ఎదుర్కోవడం డెన్మార్క్ వల్ల కానే కాదు. నిజానికి.. గ్రీన్‌లాండ్‌ని సైనికపరంగా స్వాధీనం చేసుకోకుండా అమెరికాని నిరోధించేది ఏదీ లేదు. 1951 కోల్డ్ వార్ అగ్రిమెంట్ ప్రకారం.. గ్రీన్‌లాండ్‌లో ఇప్పటికే అమెరికాకు విస్తృతమైన మిలటరీ యాక్సెస్ ఉంది. డెన్మార్క్, గ్రీన్‌లాండ్ అంగీకారంతోనే.. అక్కడ సైనిక స్థావరాలు ఏర్పాటు చేయడానికి.. అమెరికాకు హక్కులున్నాయ్. ఆర్కిటిక్ ద్వీపంలోని పిటుఫిక్ స్థావరంలో ఇప్పటికే వంద మందికి పైగా సైనిక సిబ్బందిని అమెరికా మోహరించింది. అందువల్ల.. డెన్మార్క్‌తో ఒప్పందం ప్రకారం.. ద్వీపంలోని సిబ్బంది సంఖ్యని పెంచి.. క్రమంగా ఆ భూభాగాన్ని స్వాధీనం చేసుకోవచ్చు. అయితే.. డెన్మార్క్ గ్రీన్‌ల్యాండ్‌ను రక్షంచగలదా? అనేదే బిగ్ డౌట్. అయితే.. ట్రంప్ సైనిక చర్య బెదిరింపును.. డెన్మార్క్ తీవ్రంగా పరిగణిస్తోంది. గ్రీన్‌లాండ్‌పై.. అమెరికా దాడి చేస్తే ముందుగా కాల్చులు జరిపి.. ఆ తర్వాత ప్రశ్నించండి అనే స్టాండింగ్ ఆర్డర్స్ కింద తమ ఆర్మీ ఉందని.. డానిష్ ప్రభుత్వం హెచ్చరించింది. ఇది.. 1952 సైనిక ఆదేశంలో భాగం. ఇది.. ఇది ఇప్పటికీ అమలులో ఉంది. దాని ప్రకారం.. కమాండర్లు, ప్రభుత్వం నుంచి అధికారిక ఆదేశాల వచ్చేదాకా వెయిట్ చేయాల్సిన పనిలేదు. దాడి చేసే దళాలపై.. ప్రతిదాడి చేసే స్వేచ్ఛ డానిష్ బలగాలకు ఉంది. అంతేకాదు.. గ్రీన్‌లాండ్‌ని తిరిగి ఆయుధీకరణ చేయడానికి డెన్మార్క్ దాదాపు 14 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోందని.. డానిష్ డిఫెన్స్ మినిస్టర్ కూడా చెప్పారు.

యుద్ధ విమానాల సంఖ్యలోనూ వెనుకబాటు

డెన్మార్క్ ఎంత ధైర్యంగా కనిపిస్తున్నా.. ఆ దేశం దగ్గరున్న పరిమితమైన సైనిక బలం వాస్తవాలను కాదనలేవు. అమెరికా మిలటరీ మ్యాన్ పవర్.. ఇతర నాటో సభ్య దేశాల కంటే చాలా ఎక్కువగా ఉంది. గ్లోబల్ ఫైర్ పవర్ ర్యాంకింగ్ ప్రకారం.. సైనిక బలం పరంగా అమెరికా అగ్రస్థానంలో ఉంది. డెన్మార్క్ 45వ స్థానంలో ఉంది. నాటో కూటమిలోని మిగిలిన 21 లక్షల మంది సిబ్బందితో పోలిస్తే.. ఒక్క అమెరికా దగ్గరే 13 లక్షల మంది సైనిక సిబ్బంది ఉన్నారు. వాస్తవానికి.. నాటోలో డెన్మార్క్ అత్యల్ప సంఖ్యలో 20 వేల మంది సాయుధ దళాలను కలిగి ఉంది. ఇది.. ఇండియా కోస్ట్ గార్డ్ మ్యాన్ పవర్ కంటే తక్కువ. రాయల్ డానిష్ నేవీలో 3500 మంది సిబ్బంది ఉన్నారు. ఇది.. ఇండియా ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్స్ ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్యలో మోహరించిన మొత్తం సిబ్బందికి సమానం. డెన్మార్క్ దాదాపు 9 యుద్ధ నౌకలను నిర్వహిస్తోంది. ఒక్క సబ్‌మెరైన్ కూడా లేదు. డానిష్ ఎయిర్‌ఫోర్స్ కూడా చాలా తక్కువ. ఇది.. అమెరికా బలానికి సరిపోలడం లేదు. డానిష్ వాయుసేనలో 3 వేల మంది సిబ్బంది ఉన్నారు. కేవలం.. 118 యుద్ధ విమానాలు మాత్రమే ఆపరేషనల్‌గా ఉన్నాయ్. అయితే.. వెనిజుయెలా ఆపరేషన్‌అబ్రశ్రీశ్రీలో.. అమెరికా పెద్ద సంఖ్యలో 150 వరకు యుద్ధ విమానాలను మోహరించింది. ఆ దేశ ప్రెసిడెంట్ నికోలస్ మదురోని అదుపులోకి తీసుకుంది. డెన్మార్క్ దగ్గరున్న యుద్ధ విమానాల్లో.. 26 పాతబడిన ఖీ-16ూ యుద్ధ విమానాలు, 21 ఖీ-35 లైట్నింగ్ 2 విమానాలు ఉన్నాయి. హాస్యాస్పదంగా.. మరిన్ని ఎఫ్-35 ఫైటర్ జెట్స్‌ని.. డెన్మార్క్ అమెరికా నుంచే కొనుగోలు చేస్తోంది.

ఒక్క రోజులో ముగిసే యుద్ధమా?

డెన్మార్క్ ముందున్న మరో సవాల్ ఏమిటంటే.. తక్కువ సమయంలోనే దళాలను మొబిలైజ్ చేయడం. ఎందుకంటే.. గ్రీన్‌లాండ్ డెన్మార్క్ నుంచి దాదాపు 3 వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. ఒకవేళ.. రెండు దేశాల మధ్య వివాదం తలెత్తి, అమెరికా గనక గ్రీన్‌లాండ్‌పై దండయాత్రకు దిగితే.. ఏం జరుగుతుందని సరదాగా ఊహిస్తే.. డానిష్ సైన్యంతో పాటు ఇతర మిత్రదేశాలు జోక్యం చేసుకుంటే.. పోరాటం ఒక్క రోజులోనే ముగిసిపోతుందని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ ఒక్కటే గంటల్లోనే ఆకాశంలో ఆధిపత్యం చెలాయించగలదు. ఒక నిమిట్జ్ క్లాస్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ నుంచి పనిచేసే ఎఫ్-35 లైటింగ్ 2, ఖీ/ూ-18 ఫైటర్ జెట్స్.. పూర్తి ఆధిపత్యాన్ని సాధించేందుకు సరిపోతాయంటున్నారు. అందువల్ల.. డెన్మార్క్ దగ్గరున్న పరిమిత రక్షణ సామర్థ్యాలు.. అమెరికాని ఎదుర్కోవడం ఏ రకంగానూ సరిపోవని క్లియర్‌గా అర్థమవుతోంది. అవతల ట్రంప్ లాంటి మోనార్క్ ఉన్నా.. డెన్మార్క్ తన ధైర్యాన్ని కోల్పోవట్లేదు.

గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ కన్ను ఎందుకు పడింది?

అమెరికా గ్రీన్‌లాండ్ కావాలంటోంది.. డెన్మార్క్ వదులుకునే ప్రసక్తే లేదని చెబుతోంది.. అసలు.. ప్రెసిడెంట్ ట్రంప్‌కి గ్రీన్‌లాండ్ ఎందుకు కావాలి? దేనికోసం.. ఇంతలా పట్టుదలతో ఉన్నారు? అక్కడి ప్రజలకు డాలర్లను ఎరగా ఎందుకేస్తున్నారు? గట్టిగా 60 వేల మంది జనాభా కూడా లేని ద్వీపం కోసం.. ట్రంప్ ఇంతలా ఎందుకు తహతహలాడుతున్నారు? అసలు.. గ్రీన్‌లాండ్ నుంచి ట్రంప్ ఏం ఆశిస్తున్నారు?

# భారత్ మాకు నిజమైన భాగస్వామి

న్యూఢిల్లీ,భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా రాయబారి సెర్జియో గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహబంధం నిజమైనదని అన్నారు. నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమేనని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగేందుకే వారు ప్రయత్నిస్తారని వ్యాఖ్యానించారు. 'ఇండియాతో భాగస్వామ్యం కంటే మాకు ఎవరూ ఎక్కువ కాదు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను మరో స్థాయికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తాను' అని గోర్ చెప్పారు. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం విషయంలో సంక్లిష్టతలు ఉన్నప్పటికీ వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం చేసుకునేందుకు రెండు దేశాల ప్రతినిధులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని అన్నారు. ఈనెల 13న భారత్-అమెరికా ప్రతినిధులు మరోసారి సమావేశం కావాల్సి ఉందని వెల్లడించారు. వచ్చే ఏడాది లేదా రెండేళ్లలో ట్రంప్ భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. భారత్‌కు అమెరికా రాయబారిగా ఆయన సోమవారంనాడు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమకు భారత్ తర్వాతే ఎవరైనా అని చెప్పారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద దేశమని, అందువల్ల ఒప్పందంపై ముగింపునకు తీసుకురావడం అంత తేలికైన పనికాదని, అయినప్పటికీ సాధ్యమైనంత త్వరగా ఒప్పందం కుదిరేందుకు తాము కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. భద్రత, కౌంటర్ టెర్రరిజం, ఇంధనం, సాంకేతికత, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో రెండు దేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని తెలిపారు. సిలికాన్ ఆధారిత సాంకేతికతలను రక్షించడానికి, మెరుగుపరచడానికి ఉద్దేశించిన 'ప్యాక్స్ సిలికా' కూటమిలోకి పూర్తి సభ్యత్వ దేశంగా భారత్‌ను ఆహ్వానిస్తున్నామని గోర్ వెల్లడించారు. కూటమిలో అమెరికా, జపాన్, సౌత్ కొరియా, యూకే, ఇజ్రాయెల్ దేశాలు కలిసి పనిచేయనున్నట్టు చెప్పారు.

# ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ పక్రియలో లోపాలు

కోల్‌కతా,ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మరోసారి అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ పక్రియ కోసం వినియోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ పక్రియలో లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. దీంతో నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈమేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. ఎస్ఐఆర్ మొదలు సీఈసీకి దీదీ లేఖ రాయడం ఇది ఐదోసారి. కృత్రిమ మేధ ఆధారంగా 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ చేపట్టారు. అయితే, ఈ పక్రియ సందర్భంగా ఓటర్ల వివరాల్లో తీవ్ర తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఇది కాస్తా పెద్దఎత్తున డేటా మిస్‌మ్యాచ్‌కు దారితీసింది. దీంతో నిజమైన ఓటర్లు ఈ సమస్య బారిన పడ్డారు. ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించి గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన విధానాలను ఎన్నికల సంఘం పక్కనపెట్టింది. దీంతో ఓటర్లు తమ గుర్తింపును మళ్లీ నిరూపించుకోవాల్సి వస్తోంది. ఈసీ తన సొంత పద్ధతులను విస్మరించడం.. ఏకపక్షం, అహేతుకం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఎస్ఐఆర్ సమయంలో సమర్పించిన పత్రాలకు సరైన రసీదు ఇవ్వడం లేదు. ఈ పక్రియలోనే లోపం ఉంది. ఎస్ఐఆర్ విచారణ పక్రియ సైతం చాలావరకు యాంత్రికంగా, సాంకేతిక డేటా ఆధారంగానే కొనసాగుతోంది. సున్నితత్వం, మానవీయతను పట్టించుకోవడం లేదు. ఇది మన ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తోందని మమతా బెనర్జీ తన లేఖలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. బెంగాల్‌లో ఎస్ఐఆర్‌లో భాగంగా 58 లక్షల మంది పేర్లను ఈసీ తొలగించిన విషయం తెలిసిందే.

# కోనసీమలో సంక్రాంతి సంబరాలు

కోనసీమ,సంక్రాంతి సంబరాల్లో భాగంగా.. కోనసీమ జిల్లాలో పడవ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. సోమవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం కాలవరేవు తాడిపూడి వంతెన వద్ద ఆత్రేయపురం ఉత్సవం పేరుతో రెండవ రోజు పడవ పోటీలు ప్రారంభమయ్యాయి. సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలలో భాగంగా ఈరోజు ప్రారంభమైన పడవ పోటీలను ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో పి. శ్రీకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కేరళ, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన 22 జట్లు పాల్గొన్నాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ బోటు ఫెస్టివల్ ను చూసేందుకు ఇతర రాష్ట్రాల నుండే కాకుండా ఇతర దేశాల నుండి కూడా చూసేందుకు తరలివచ్చారు. ఇకపోతే గుంటూరు నగరంలో వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి పోటీలు నిర్వహించారు. మాజీ మంత్రి రోజా పాల్గొన్నారు. మహిళల ముగ్గుల పోటీల్లో మొదటి విజేతకు రూ.లక్ష, రెండో విజేతకు రూ.50 వేల చొప్పున బహుమతులు అందించారు. అనంతరం కోడిపందేలు నిర్వహించగా.. రాంబాబు, రోజా కోడి పుంజులను బరిలోకి వదిలారు. తాను ఏటా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నానని, గతంలో సత్తెనపల్లిలోనూ ఈ పోటీలు జరిగినట్లు అంబటి రాంబాబు తెలిపారు. రాష్ట్రంలో రాంబాబు అంటే సంక్రాంతి.. సంక్రాంతి అంటే రాంబాబు అంటూ అంబటికి రోజా కితాబిచ్చారు.

# నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు పిటిషన్

న్యూఢిల్లీ,నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అధికారికంగా ప్రకటించారు. పిటిషన్ ఉపసంహరణ నేపథ్యంలో కేసును డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా ధర్మాసనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో తెలంగాణా ప్రభుత్వానికి సీజేఐ కీలక సూచనలు చేశారు. నల్లమల సాగర్ అంశంపై రిట్ పిటిషన్ ద్వారా ముందుకు వెళ్లడం ప్రయోజనకరం కాదని స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు రిట్ పిటిషన్ సరైన మార్గం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. నల్లమల సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి తమ వాదనలు, అభ్యంతరాలను వినిపించాలంటే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సూచించారు. అదే సరైన న్యాయపరమైన మార్గమని అభిప్రాయపడ్డారు. తెలంగాణా ప్రభుత్వం పిటిషన్ ఉపసంహరించుకోవడంతో ఈ కేసును సుప్రీంకోర్టు డిస్పోజ్ ఆఫ్ చేసినట్లు ఆయన ప్రకటించారు. దీంతో భవిష్యత్తులో సివిల్ సూట్ రూపంలో ఈ అంశం మరోసారి కోర్టు ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. పోలవరం ప్రాజెక్టు నుంచి నల్లమల సాగర్‌కు నీటిని తరలించే లింక్ ప్రాజెక్టుపై తెలంగాణా ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు లేవని, బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తన పిటిషన్‌లో పేర్కొంది. చట్టపరంగా మరింత పటిష్ఠంగా వ్యవహరించాలనే సుప్రీంకోర్టు సూచనతో తెలంగాణా ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకుంది.

# దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం

హైదరాబాద్,దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం అందిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో 'బాల భరోసా' పథకం, 'ప్రణామ్' డే కేర్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు రూ. 50 కోట్లతో పరికరాలను అందించామని రేవంత్ తెలిపారు. ప్రభుత్వం మీ కోసం ఉందని చెప్పడానికే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు.ప్రణామ్ కార్యక్రమంతో వృద్ధులను ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుంచి 15 శాతం కోత విధిస్తాం. ఈ బ్జడెట్ సమావేశాల్లో బిల్లు తీసుకొస్తున్నాం. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసేవారిని మనమే దారిలోకి తీసుకురావాలి. కన్నవారి పట్ల బాధ్యత లేనివారికి సమాజంపై ఏం బాధ్యత ఉంటుందని రేవంత్ అన్నారు. దివ్యాంగులు ఒకరినొకరు పెళ్లి చేసుకుంటే రూ. 2 లక్షల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. వారిని ఇతరులు పెళ్లి చేసుకున్నా ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం ఇస్తాం. క్రీడల్లో రాణించినవారికి ఉద్యోగాలు ఇస్తాం. ప్రభుత్వం కల్పించే అవకాశాలను ఉపయోగించు కుంటూ ఎదగాలి. ఈ ప్రాంతంలో ప్రత్యేక ప్రతిభావంతులకు జైపాల్ రెడ్డి స్ఫూర్తి. మా ప్రభుత్వంలో ట్రాన్స్‌జెండర్లకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్‌ను కార్పొరేటర్‌గా నామినేట్ చేయాలని మంత్రులను కోరుతున్నా. అలాగే మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యులుగా నామినేట్ చేయాలి. ట్రాన్స్‌జెండర్ సమస్యలను వాళ్లే చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనేదే ఈ ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణ సమాజం స్వేచ్ఛను, సామాజిక న్యాయం, సమాన అవకాశాన్ని కోరుకుంటుంది దాదాపు వందేళ్ల తర్వాత రాష్ట్రంలో కులగణన జరిగింది. కులాల జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి. మా ఒత్తిడితోనే కేంద్రం కుల గణన చేస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, రాజనర్సింహ, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

# మంటెక్కిస్తోందా ?

అమరావతి,ఉప ముఖ్యమంత్రిగా జనసేన అధినేతగా పవన్ కళ్యాణ్ తన రాజకీయం గురించి జనాలకు అయితే ఒక క్లారిటీ ఇచ్చారు. ఆయన 2014 నుంచి రాజకీయాల్లో ఉన్నారు. మొదట బీజేపీ టీడీపీకి మద్దతు ఇచ్చారు. 2019 నాటికి వామపక్షలు బీఎస్పీతో పొత్తు పెట్టుకున్నారు. 2020కి వచ్చేసరికి బీజేపీతో పొత్తు పునరుద్ధరించుకున్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీతో కలసి పోటీ చేశారు. ఇక పవన్ ఉప ముఖ్యమంత్రిగా ఉండగా సనాతన వాదాన్ని తెర మీదకు తెచ్చారు. దానిని ఒక నినాదంగా ఆయన తరచూ చెబుతూ వస్తున్నారు. దీని మీద సనాతన వాదులు ఏ విధంగా చూస్తున్నారు, ఏ విధంగా తీసుకుంటున్నారో తెలియదు కానీ వామపక్షలకు అయితే మంటగా ఉందని అంటున్నారు. వారి వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం అని అంటున్నారు.

అదంతా రాజకీయ వ్యూహం :

పవన్ కళ్యాణ్ రాజకీయ వ్యూహం ప్రకారమే సనాతన వాదాన్ని ఎంచుకున్నారు అని సీపీఐ సీనియర్ నాయకుడు కె నారాయణ అంటున్నారు. ప్రధాని మోడీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా మెప్పు కోసమే పవన్ ఈ విధంగా మాట్లాడుతున్నారు అని ఆయన విమర్శించారు. నిజానికి వ్యక్తిగతంగా పవన్ కి సనాతన ధర్మం గురించి నమ్మకం లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యక్తిగతంగా ఆచరించడం లేదని కూడా నారాయణ చెప్పడం విశేషం.

నైతిక అర్హత లేదంటూ :

పవన్ వ్యక్తిగత జీవితంలో చూస్తే ఆయన సనాతన ధర్మానికి వ్యతిరేకంగానే వ్యవహరించారు అని నారాయణ ఎత్తి పొడుస్తున్నారు. సనాతన ధర్మలో విడాకులు అన్నదే లేదని మరి దానికి పవన్ ఏమి చెబుతారు అని ప్రశ్నించారు. కాషాయ పెద్దల మెప్పు కోసమే పవన్ తన వేషాన్ని భాషను మార్చుకున్నారని నారాయణ సెటైర్లు వేశారు. అయినా సనాతన ధర్మం గురించి చెప్పే నైతిక అర్హత ఆయనకు లేదని కూడా నారాయణ విమర్శించడం విశేషం.

కమ్యూనిస్టు భావజాలమంటూ :

ఇక పవన్ తనది కమ్యూనిస్టుల భావజాలం అని తరచూ చెప్పేవారు అని నారాయణ గుర్తు చేశారు. ఇక తనతో చాలా సార్లు సమావేశమైనపుడు కూడా ఆయన కమ్యూనిస్టు రాజకీయాల గురించే ఎక్కువగా చర్చించేవారు అని ఆయన చెప్పడం గమనార్హం. అంతే కాకుండా వామపక్షలతో పొత్తు పెట్టుకుని పోటీ చేసిన వారుగా పవన్ ఉన్నారని చెప్పారు. అయితే రాజకీయాల్లో అవకాశవాదంతో పవన్ తన సిద్ధాంతాలను మార్చుకుంటూ వెళ్ళారని ఆయన మండిపడ్డారు. పవన్ ఒకపుడు అభ్యుదయ వాదాన్ని వినిపించి ఇపుడు సనాతన వాదాన్ని వినిపిస్తున్నారని నారాయణ ఫైర్ అయ్యారు. ఇకనైనా పవన్ తన వైఖరి మార్చుకోవాలని లేకపోతే ప్రగతిశీల భావజాలం ఉన్న వారు ఆయనకు తగిన గుణపాఠం చెబుతారు అని నారాయణ హెచ్చరించడం విశేషం.

సిద్ధాంత విరోధం :

పవన్ కాంగ్రెస్ కో లేక టీడీపీకి మద్దతు పలికినా వామపక్షలకు పెద్దగా అభ్యంతరం లేకపోయేది కానీ ఆయన పోయి పోయి కమలం పార్టీకి దన్నుగా నిలబడడం మీదనే వారు మండిపోతున్నారు అని అంటున్నారు. మొదటి నుంచి వామపక్షలకు కాషాయం పార్టీకి మధ్య చూస్తే సిద్ధాంతాల మధ్య తీవ్రమైన అంతరం ఉందని చరిత్ర చెబుతున్న విషయం. ఇక పవన్ పొత్తులతో ఆగకుండా బీజేపీ నేతలు కూడా ఎన్నడూ పెద్దగా మాట్లాడని విధంగా సనాతన వాదాన్ని జనంలోకి ప్రచారం చేయడం మీద కూడా కామ్రేడ్స్ ఆగ్రహంగా ఉన్నారని అంటున్నారు. పవన్ ది రాజకీయ అవకాశవాదం అని ఇపుడు విమర్శిస్తున్న కామ్రేడ్స్ రేపటి రోజున ఆయన మళ్లీ తన వైపు చేరితే ఈ మాట అనగలరా అన్న చర్చ కూడా ఉంది. ఏది ఏమైనా పవన్ మీద నారాయణ విమర్శలు అయితే కొంత చర్చనీయాంశంగానే ఉన్నాయి.

# నో కోఆపరేషన్..

హైదరాబాద్, యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంచి,ఉపాధి చూపించి ఆర్థిక దన్ను కల్పించాల్సిన కార్పొరేషన్లు నిర్వీర్యం అవుతున్నాయి. నిధుల్లేక, పాలవకర్గాలూ లేక, కార్యాలయాలు అసలే లేక నీరసించిపోతున్నాయి. చేయూత ను అందించాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడంతో ఆ సహకార సంస్థలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. సంక్షమ పథకాల అమలును పర్యవేక్షంచాల్సిన ఆ కార్పొరేషన్లు కేవలం ప్రణాళికలకే పరిమితమవుతున్నాయి. వీటి ఉనికి ప్రశ్నార్థకంగా మారడంతో వెరసీ రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారుతున్నాయి. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యువతకు రాయితీపై రుణాలు మంజూరు చేసి, నైపుణ్యాభివృద్ధిని పెంచి దారిచూపే సమున్నత లక్ష్యంతో కేసీఆర్ సర్కారు 17 ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటుచేసింది. దళితబంధు, బీసీ బంధుతోపాటు యువత స్వయం ఉపాధి యూనిట్లకు నిధులు మంజూరు చేసింది. దీంతో ఆనాడు కొత్త రాష్ట్రమైనా ఎంతోకొంత ఆర్థిక పరిపుష్ఠి కల్పించి ఊపిరూలూదింది. సంక్షమ పథకాల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. రెండేండ్ల కిందట గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా మరో 13

# శీతకాలం కోత పెట్టగ...




న్యూఢిల్లీ,చల్లదనం గురించీ, వేడి గురించీ ఒక్కోసారి మన ఊహల్ని తలకిందులు చేస్తూ, మాటలకు మనమిచ్చే అర్థాలను సవరించుకోవలసిన పరిస్థితులు ఎదురవుతాయి. ఈ శీత ఋతువులో అదే జరుగుతోంది. శీతవాయువు కోతకత్తిగా మారి శరీరాన్ని నిలువునా కోసి చలికారం అద్దుతోంది. మండువేసవిని మించి, రోజంతా చలి దహిస్తోంది. బతుకైనా, బాగైనా మితిలోనే ఉందనీ, అతి అన్నిటా అనర్థానికే దారి తీస్తుందనీ మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తోంది. ఈ ఏడాది దేశంలో అనేకచోట్ల సాధారణ ఉష్ణోగ్రత గణనీయంగా పడిపోయి చలిగాలుల ఊపేస్తాయని వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. భూమి చరిత్రలోనే కానీ, మానవ చరిత్రలోనే కానీ ఋతుగమనం హఠాత్తుగా తూకం తప్పి బతుకులను తలకిందులు చేసిన ఘట్టాలు అసంఖ్యాకం. చరిత్రకెక్కినవి కొన్నే. సాధారణ శకం 536లో అగ్నిపర్వతాలు బద్దలై యూరప్, మధ్యప్రాచ్యం, ఆసియాలలో ఆకాశాన్ని అంధకారంతో కప్పేసి అతి శీతల వత్సరాలను సృష్టించాయి. అది అసాధారణ స్థాయిలో హిమపాతానికీ, కరవు కాటకాలకూ, మానవ, జంతు మరణాలకూ దారితీసింది. యూరప్‌తో సహా పలుచోట్ల 1300ఉ1850 మధ్యకాలాన్ని చిన్నపాటి మంచుయుగంగా లెక్కించారు. 1709లో యూరప్‌లో విస్తారమైన ప్రాంతాలు మంచు భూములుగా మారిపోయి, అనేక ప్రాణాలకు సమాధులయ్యాయి. 1783ఉ84లో ఉత్తర అమెరికాలో విపరీత శైత్యం తీవ్ర దుర్భిక్షనికీ, చివరికి ఫ్రెంచి విప్లవానికీ దారితీసింది. 1816లో వేసవే లేకుండా పోయింది. 1963లో బ్రిటన్‌లో, 1972లో ఇరాన్‌లో, 2008లో అఫ్ఘనిస్తాన్‌లో హిమపాతాలూ, చలిగాలులూ పెద్ద సంఖ్యలో ప్రాణాలు హరించాయి. శిశిరం శివతాండవం చేస్తూ కరవు కాటకాలతో జీవజాలాన్ని ఆకుల్లా రాల్చి వేయడం గమనిస్తే శ్రీశ్రీ 'దేశచరిత్రలు' కవిత గుర్తొస్తుంది. అంతా తన ప్రయోజకత్వమే అనుకుంటూ మనిషి స్థాపించిన సామ్రాజ్యాలు... 'ఇతరేతర శక్తులు' లేస్తే పేకమేడల్లా పడిపోయా యంటాడాయన. అలాగే, మౌర్య సామ్రాజ్యంలో తలెత్తినట్టు చెబుతున్న పన్నెండేళ్ళ దుర్భిక్షనికి అతిశీతల వాతావరణమో, లేదా అలాంటి మరేదైనా 'ఇతరేతర' శక్తో కారణం కావచ్చు. అప్పుడు భద్రబాహుడనే జైనముని జైన సంఘాన్ని వెంట బెట్టుకుని దక్షణ భారతానికి తరలివచ్చాడనీ, చక్రవర్తి చంద్రగుప్తుడు కూడా సింహా సనాన్ని త్యజించి దక్షణాపథానికి వచ్చాడనీ చరిత్ర చెబుతోంది. సమతూకపు ఋతుగమనానికీ, భూమ్మీద జీవజాలం మనుగడకూ ఉన్న పీటముడి ఎలాంటిదో ఉ ఆ తూకం హఠాత్తుగా తారుమారైనప్పుడే తెలిసి వస్తుంది. శీతర్తువు కరుణించి తగినంత వెచ్చదనాన్ని జోడించినప్పుడు, పోతన భాగవతంలో వర్ణించినట్టు మన్మథుడు విరహులకు హేమంతం అడుగుపెట్టినట్టు గబ్బున తోపించి అదేపనిగా వేధిస్తూ అర్ధాంగి నులివెచ్చని ఆలింగన సౌఖ్యం వైపు నడిపిస్తాడు. హాలుడు 'గాథసప్తశతి'లో అభివర్ణించినట్టు, ఆ భరోసాతోనే భర్త పశువులను కొనుక్కోడానికి పైబట్టను అమ్ముకుంటాడు. 'చలి వడి కించే శైశిర కాలం వస్తూపోతూ దాగుడుమూతల క్రీడలాడుతవి మీ నిమిత్తమే'నంటూ మహాకవి శ్రీశ్రీ శైశవగీతిని ఆలపిస్తాడు. అదే శీతర్తువు ఒకింత గతి తప్పిందా... అస్తిత్వమే అల్లకల్లోలమైపోతుంది. చలిగాలుల విజృంభణకు శాస్త్రవేత్తలిప్పుడు వివిధ కారణాలు ఎత్తి చూపుతున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో సంభవించే వాతావరణ పరిస్థితులూ, మధ్యధరా సముద్ర ప్రాంతంలో సంభవించే అలజడులూ చల్లని ఉత్తరపు గాలుల్ని సృష్టించి హిమాలయాల మీదుగా వ్యాపింపజేస్తాయంటున్నారు. శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగం కూడా ఉష్ణోగ్రతను కట్టడి చేసి శీతల వాయువులను సృష్టిస్తోందట. శాస్త్రజ్ఞులు చెప్పిన కారణాలు కొన్ని భాగవత కవికి అనుభవపూర్వకంగా తెలుసు. ఉత్తరపు గాలి విసురుతోందనీ, తామరలు తరిగి అంతటా మంచు నెలకొందనీ అంటాడు. సూర్యుడు శక్తిహీనుడు కావడం వల్ల హిమాలయాల నిండా మంచు పేరుకుని ఆ పేరును సార్థకం చేస్తోందని రామాయణ కవి అంటాడు. వందల కోట్ల సంవత్సరాల అస్తిత్వంలో పుడమితల్లి ఇలాంటి పురిటినొప్పులు ఎన్ని పడిందో! ఎన్ని మంచు యుగాలను చూసిందో! మన మేరకు మనం చేజేతులా వాతావరణ విధ్వంసానికి పాల్పడకుండా జాగ్రత్త పడటమే చేయవలసినదీ, చేయగలిగినదీ!

# మకర సంక్రాంతిపైనా వివాదం

తిరుమల,పండగల తేదీలపై ఏటా కొన్ని విభేదాలు వస్తూనే ఉన్నాయి. ఏ రోజు ఏ పండగ అన్నది వివాదాలకు దారితీస్తోంది. తాజాగా సంక్రాంతి పర్వదినంపైనా కొంత చర్చ మొదలయ్యింది. మకర సంక్రాంతి.. ఏడాదిలో వచ్చే తొలి పండగే కాదు. అతి పెద్ద పండగల్లో ఇది కూడా ఒకటి. ఈ ఏడాది ఈ మకర సంక్రాంతి పండగ జనవరి 14 లేదా 15వ తేదీన జరుపుకోవాలా? అనే సందేహం చాలా మందిలో కలుగుతోంది. అదీకాక చాంద్రమానం ప్రకారం ఏడాదిలో దాదాపు అన్ని పండగలు జరుపుకుంటాం. కానీ సౌరమానం ఆధారంగా సంక్రాంతిని జరుపుకుంటాం. ఇంకా చెప్పాలంటే.. సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే పవిత్ర ఘడియలనే మకర సంక్రాంతిగా అంతా పరిగణిస్తారు. ఈ ఏడాది 14వ తేదీన పవిత్ర స్నానాలు, దానధర్మాలు, సూర్య ఆరాధన చేయాలని పండితులు స్పష్టం చేస్తున్నారు.కొన్ని సంప్రదాయ పంచాంగాలు సూర్యోదయం ఆధారంగా నియమాలను అనుసరిస్తాయి. సూర్యుడు సాయంత్రం చాలా ఆలస్యంగా లేదా సూర్యాస్తమయం తర్వాత మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. దాంతో పండగ మరుసటి రోజు జరుపుకుంటారు. కానీ ఈ ఏడాది జనవరి 14వ తేదీ మధ్యాహ్నమే ఈ మార్పు జరుగుతుంది. దాంతో ఈ పండగ బుధవారం అంటే.. జనవరి 14వ తేదీనే జరుపుకోవాలని అంటున్నారు.దీని ప్రకారం మకర సంక్రాంతి వేడుకలకు జనవరి 14వ తేదీగా నిర్ణయించారు. ఆరోజు మధ్యాహ్నం 3.13 గంటలకు సంక్రాంతి ముహూర్తం వస్తుంది. ఈ నేపథ్యంలో ఆ రోజే పండగ జరుపుకోవాలని,. అంటే జనవరి 15వ తేదీ కాదన్నది సుస్పష్టం. అయితే ఇప్పటికే మకరసంక్రాంతి 15గా నిర్ణయించారు. ప్రభుత్వం కూడా అదేరోజు సెలవుగా పరిగణించింది. మకర సంక్రాంతి వేళ.. సూర్యుడు దక్షిణాయణం ముగించుకుని.. ఉత్తరాయణం దిశగా ప్రారంభాన్ని సూచిస్తుంది. సూర్య భగవానుడి ప్రయాణ మార్పు ఆశ, కాంతి, సానుకూల శక్తిని తెస్తుందని అంతా ప్రగాఢంగా విశ్వసిస్తారు.ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు సూర్యుడిని పూజిస్తారు. పేదవారికి వస్త్రాలు దానం చేస్తారు. తమిళనాడులో పొంగల్‌గా ఈ పండగను జరుపుకుంటారు. ఇది అనేక రోజుల పంట పండగా వారు భావిస్తారు.అసోంలో మాఘ్ బిహుగా జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్లో: పౌష్ పర్బన్ అని ఈ పండగను పిలుస్తారు. అయితే ఈ పండగ పేర్లు, ఆచారాలు భిన్నంగా ఉన్నప్పటికీ అన్ని వేడుకలు పంట శ్రేయస్సుతోపాటు కృతజ్ఞతతో ముడిపడి ఉంటాయి.

# జల రాజకీయాలను తిప్పికొట్టాలి !



న్యూఢిల్లీ,నదీజలాల విషయంలో ఇరు తెలుగు రాష్ట్రాలు సంయమనంతో ముందుకు సాగాల్సిన తరుణమిది. జల జగడాలు మంచిది కాదు. ఈ రగడతో ప్రజలను సెంటిమెంట్‌తో ముంచాలని చూస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు. ఎందుకంటే నీళ్ల కోసమే తెలంగాణ పోరాటం సాగింది. ఇందులో అనుమానాలు లేవు. అందువల్ల నీటి కోసం ప్రతిపక్షాలు చేసే విమర్శలకు లోను కావద్దు. వారి రాజకీయాలకు బలి కావద్దు. ఏపిలో జగన్, తెలంగాణలో బిఆర్ఎస్ జలజగడాలతో రాజకీయం చేయచూస్తున్నాయి. వీరి మాటలను తిప్పికొట్టాలి. సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవాలి. ఇకపోతే తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు కూడా జలజగడాలకన్నా పరిష్కారాలే ముఖ్యమని అంటున్నారు. అందువల్ల వాటిని అనుసరించడమే శ్రేయస్కరం. వృధాగా పోతున్న జలాలను పరిరక్షించుకోవడంలో వ్యూహాత్మకంగా అడుగులు వేయాలి. నదీజలాలను ఎంతగా ఒడిసిపడితే అంత మంచిది. ఎండిన బీళ్లను తడపాలి. నదుల్లో నీరంతరాయంగా నీరు పారేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. అయితే తెలుగునాట జల రాజకీయాలు మరింత వికృతంగా మారుతున్నాయి. ఏ స్థాయిలో దుష్ప్రచారం చేయబోతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఎవరి రాజకీయం వారిది. ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టగలిగి నప్పుడే రాజకీయ నాయకులు తమ పబ్బం సాధ్యమవు తుంది. తెలంగాణ ప్రజలు నీళ్లతో త్వరగా కనెక్టవుతారు. అందుకే కేసీఆర్ అండ్ కో జల వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. అలాగే జగన్ కూడా తన హయాంలో నిలిచిపోయిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబు ఆపారని ప్రచారం చేస్తున్నారు. ఎప్పుడో నిలిచిపోయిన ఈ పథకం గురించి బిఆర్ఎస్ నేతలు పెడబొబ్బలు పెడుతున్నారు. తెలంగాణకు అన్యాయం జరుగుతోందని కెటిఆర్,హరీష్ రావులు విమర్శించడం హాస్యాస్పదం. సమాజంలో విద్వేషాలు రగిలించడానికి పెద్దగా శ్రమ పడాల్సిన అవసరం లేదు. తెలుగు రాష్ట్రాల మధ్య ప్రస్తుతం నడుస్తున్న జల వివాదంలో ప్రతిపక్షాలు తమవంతు పాత్రను పోషిస్తున్నాయి.. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై విపక్ష జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు రాజకీయం మొదలు పెట్టారు. ఈ పథకాన్ని చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆపేశారని జగన్ ఆరోపించారు. జగన్ మీడియాలో ఆంధ్రప్రదేశ్ ద్రోహిగా చంద్రబాబును చిత్రీకరిస్తుండగా, కేసీఆర్ సొంత మీడియాలో చంద్రబాబును నీటి దొంగగా, తెలంగాణ ద్రోహిగా చిత్రీకరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా నీటిని తరలించుకుపోవడం ద్వారా చంద్రబాబు తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని ప్రచురిస్తున్నారు. ఈ ఇరువురు నాయకుల సొంత మీడియాలో చేస్తున్న ప్రచారంలో నిజానిజాలఅఉ ఎలా ఉన్నా కవాలని చేస్తున్న ఈ ప్రచారం కారణంగా ప్రజల్లో విద్వేషం రెచ్చొగొటటే ప్రయత్నాలు మొదలయ్యాయి. బిఆర్ఎస్ మీడియా ప్రకారం స్వరాష్ట్రం కోసం చంద్రబాబు జల చౌర్యానికి పాల్పడుతున్నారు. జగన్ మీడియా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేస్తూ తెలంగాణకు చంద్రబాబు మేలు చేస్తున్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసమే వారు అలాంటి కథనాలను వండి వారుస్తున్నారన్నది వేరుగా చెప్పనక్కరలేదు. పాలకులు ఎవరైనా తమ స్వరాష్ట్రాల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించలేరు. ఎంతటి జటిలమైన సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చు. జలవివాదాలపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపి సీఎం చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనలు హుందాగా ఉన్నాయి. వివాదం పరిష్కారం కాకూడదన్న కోరిక కేసీఆర్, జగన్ రెడ్డిలకు ఉండవచ్చునుగానీ వారికి ఆ అవకాశం ఇవ్వకుండా సంయమనంతో వ్యవహరించవలసిన బాధ్యత ఇరు రాష్ట్రాల సిఎంలపై ఉంది. స్థానిక ఎన్నికలు సమీపించే కొద్దీ ఇలాంటివి మరికొన్నింటిని తెరమీదకు తెస్తారు. ఈ విషయంలో కేంద్రం కూడా చోద్యం చూడడం సరికాదు. కోర్టు గడపలు ఎక్కడం కూడా మంచిది కాదు. ఇరు రాష్ట్రాల జలవివాదాలపై ఉన్నతస్థాయి కమిటీకి పర్యవేక్షణ అప్పగించాలి. సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని రాయలసీమకు తరలించి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే పోలవరం- నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్ట్ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ చెబుతోంది. గోదావరి బేసిన్‌లో ఆంధప్రదేశ్ దిగువ ప్రవాహ రాష్ట్రం కావడంతో, ఇతర రాష్ట్రాల హక్కులకు భంగం కలగకుండా మిగిలిన వరద నీటిని వాడుకోవచ్చునని పేర్కొంన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై కేంద్రానికి నివేదిక సమర్పించారు. వారి సూచనల మేరకే మార్పులు చేస్తున్నారు. డీపీఆర్‌కు సంబంధించిన టెండర్లు కేవలం ముందస్తు సన్నాహక చర్య మాత్రమేనని పేర్కొన్నారు. చట్టపరమైన అన్ని అనుమతులు వచ్చాకే పోలవరం- నల్లమలసాగర్ ప్రాజెక్టు చేపడతామని ప్రభుత్వం ప్రకటించింది. గోదావరిపై పోలవరం- నల్లమల్ల సాగర్ లింక్ ప్రాజెక్ట్ చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గోదావరి నది ప్రవహించే చివరి రాష్ట్రం ఏపీ. తెలంగాణ నుంచి ఏపీలోకి ప్రవేశించే ఈ నీరు.. అంతర్వేది వద్ద సముద్రంలో కలుస్తుంది. ఈ నీటిని వృథాగా సముద్రంలో కలిసే కంటే.. ఆ మిగులు జలాలను పోలవరం- నల్లమల్ల లింక్ ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమ పంపడం.. ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఏపీ ప్రభుత్వం సన్నాహకాలు చేస్తోంది.అయితే ఈ లింక్ ప్రాజెక్టను తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దాంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై సుప్రీంకోర్టును తెలంగాణ ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో కేసు విచారణ సుప్రీంకోర్టులో కొనసాగుతోంది. అయితే ఎలాంటి పొరపాట్లు లేకుండా ముందుకు సాగాల్సి ఉంది. ఇరు రాష్ట్రాలు కూర్చుని సమస్యలు పరిష్కరించాలి. ప్రజల్లో విద్వేషాలను రగిల్చేవారిపట్ల జాగ్రత్త వహించాలి.

# పాలమూరు పర్యటనలో కెటిఆర్‌కు ఘన స్వాగతం

మహబూబ్‌నగర్,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనతో మహబూబ్ నగర్ గులాబీ వనంలా మారింది. బీఆర్ఎస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీతో ఆయనకు ఘన స్వాగతం పలికాయి. కేసీఆర్ జిందాబాద్, కేటీఆర్ జిందాబాద్ నినాదాలతో పాలమూరు మారుమోగింది. షాద్‌నగర్‌లో పార్టీ శ్రేణుల నుంచి ఘన స్వాగతం స్వీకరించిన కేటీఆర్.. పార్టీ కార్యకర్తలకు అభివాదం చేస్తూ ర్యాలీగా ముందుకు కదిలారు.అనంతరం మహబూబ్ నగర్ గ్రౌండ్‌లో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన బహిరంగ సభావేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లను సన్మానించారు. కాంగ్రెస్ అణిచివేతను ఎదుర్కొని పోరాడి ఎన్నికల్లో గెలిచినందుకు వారికి అభినందనలు తెలియజేశారు. జిల్లాలోని జడ్చర్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి బీఆర్ఎస్ శ్రేణులు, ఘనస్వాగతం పలికారు. అడుగడుగునా కేటీఆర్‌పై అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా బాలానగర్ మండలం పెద్దాయిపల్లి చౌరస్తాలో కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జడ్చర్ల గులాబీ దండు చూపించిన ప్రేమకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ కేటీఆర్ , మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ముందుకు సాగారు. హైద్రాబాద్ బెంగళూరు జాతీయ రహదారి పొడవునా జడ్చర్ల నియోజకవర్గ కార్యకర్తల ఉత్సాహాన్ని కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు.ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ కంటే ఎక్కువ సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకొని సత్తా చాటినందుకు కేటీఆర్ ప్రశంసించారు. ప్రత్యేకంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి నాయకత్వంలో మరింత బలంగా పోరాడాలని పార్టీశ్రేణులకు సూచించారు.

# యూరియా వాడకం తగ్గించండి

ఖమ్మం,పంటలకు యూరియా వాడటం వల్లే నష్టం కలుగుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యూరియా వాడకం క్రమంగా తగ్గించాలని సూచించారు. అన్నదాతలకు పెట్టుబడి ఖర్చు తగ్గాలని, ఆదాయం పెరగాలని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వినయోగం తగ్గిస్తే ఆదాతో పాటు ఆదాయం పెరుగుతుందన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం చింతగుత్తిలో డ్రోన్ స్ప్రేను మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. తాను పురుగులమందులకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు మంత్రి తుమ్మల. పంటకు కొట్టాల్సిన దానికంటే ఎక్కువ పురుగులమందు కొట్టి భూమాతను చంపేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాచురల్ ఫార్మింగే ఉత్తమమని.. దీనిపై రైతన్నలు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పురుగులమందుల డూప్లికేట్ కంపెనీలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పంటలకు ఎక్కడ, ఏ తెగులు ఉందని శాటిలైట్ ద్వారా సమీక్షించి రైతుకు చెప్పాలని అనుకుంటున్నామని తెలిపారు. దానికి కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుంటున్నామని వెల్లడించారు. అన్నదాతలందరికీ అధికారులు డ్రోన్ల మీద అవగాహన కల్పించాలని సూచించారు. తాను పంటలకు యూరియా వేయనని, యూరియా వేయకపోతే పురుగుమందు వాడాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. యూరియా ఎంత కావాలంటే అంత ఇస్తామని, కానీ అది పంట చేలకు అరిష్టమని తెలిపారు. ప్రతిపక్షాలు యూరియా మీద పబ్బం గడపాలని చూస్తున్నాయని విమర్శలు గుప్పించారు. పామాయిల్, కొబ్బరికి డ్రోన్ అవసరం ఉండదని చెప్పుకొచ్చారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా మిషన్లు కనిపెట్టాలని శాస్త్రవేత్తలను కోరారు. అన్ని దేశాల్లో మన దేశం నంబర్ వన్ అని, అన్ని రాష్టాల్లో తెలంగాణ రాష్ట్ర నంబర్ వన్‌గా ఉండాలనేదే తన ఆకాంక్షని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఆ పార్టీల గతేంటి?

హైదరాబాద్,తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా కొన్ని రోజుల్లో మోగబోతోంది. ఇప్పటికే రాజకీయ వేడి పీక్ స్టేజ్‌కు చేరుకుంది.తెలంగాణ రాజకీయ క్షత్రం ఇప్పుడు ఒక ఆసక్తికరమైన మలుపు తిరగబోతోంది. ఇప్పటి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్యే ప్రధాన పోరు ఉంటుందని భావించిన రాజకీయ విశ్లేషకులకు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఊహించని షాక్ ఇచ్చారు. ఏపీలో సృష్టించిన ప్రభంజనాన్ని తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతం చేసేందుకు 'సేన' సిద్ధమైంది. కేవలం పొత్తులకే పరిమితం కాకుండా, ఒంటరి పోరుకు సై అనడం ద్వారా పవన్ కళ్యాణ్ తెలంగాణ కోటలో తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవ్వడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా కొన్ని రోజుల్లో మోగబోతోంది. ఇప్పటికే రాజకీయ వేడి పీక్ స్టేజ్‌కు చేరుకుంది. ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న ఈ ఎన్నికలు ప్రధాన పార్టీలకు జీవన్మరణ సమస్యగా మారిన తరుణంలో, జనసేనాని పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం అన్ని పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో తిరుగులేని విజయం సాధించి, పాలనలో తనదైన శైలిని చూపిస్తున్న పవన్, ఇప్పుడు తన దృష్టిని తెలంగాణ వైపు మళ్లించారు.

సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా

గతంలో బీజేపీతో పొత్తులో భాగంగా కొన్ని స్థానాలకే పరిమితమైన జనసేన, ఈసారి రూట్ మార్చింది. క్షత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా 'ఒంటరి పోరు'కు సిద్ధమైంది. ఇప్పటికే జనవరి 10న వెలువడిన అధికారిక ప్రకటనతో జనసైనికుల్లో కొత్త ఉత్సాహం నిండింది. బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు, గ్రామ స్థాయి వరకు పార్టీ జెండాను తీసుకెళ్లడం ద్వారా తెలంగాణలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు పవన్ వ్యూహరచన చేస్తున్నారు.

టెన్షన్‌లో ప్రధాన పార్టీలు..

జనసేన ఎంట్రీ ఇప్పుడు తెలంగాణలోని త్రిముఖ పోరును చతుర్ముఖ పోరుగా మార్చివేయబోతోంది. అయితే, ఈ చీలిక ఓట్లు ఏ పార్టీని దెబ్బతీస్తాయనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. కాంగ్రెస్, బీఆర్ఎస్ లను పరిశీలిస్తే పట్టణ ప్రాంతాల్లో యువత, నిరుద్యోగుల మద్దతు జనసేన వైపు మళ్లితే, ఈ రెండు పార్టీల ఓటు బ్యాంకుకు గండి పడే అవకాశం ఉంది. బీజేపీ నుంచి చూసుకుంటే గతంలో మిత్రపక్షంగా ఉన్న జనసేన ఇప్పుడు విడిగా పోటీ చేయడం వల్ల, ఉమ్మడి ఓట్లు చీలి బీజేపీకి ఇబ్బందికరంగా మారే ప్రమాదం ఉంది.

# అమరావతిని శ్మశానం..ఎడారి అని అన్నారు

అమరావతి,రాజధాని అమరావతిని శ్మశానం, ఎడారి అని గతంలో హేళన చేశారని.. కానీ ఇదో స్ఫూర్తిదాయక ప్రాజెక్టు అని సిఎం చంద్రబాబు చెప్పారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. అధికారులతో సమీక్షలో సిఎం ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు అని.. అది పూర్తయితే దక్షిణ భారతంలో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదని చెప్పారు. నల్లమలసాగర్ ద్వారా రాయలసీమ ప్రాంతంతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదన్నారు. ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు.

# ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు...



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పని భారం, ప్రభుత్వ బాధ్యతలపై భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి వరకు తాను ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదని, సెలవు తీసుకుందామని అనుకున్న ప్రతీసారి ఏదో ఒక పని వచ్చి పడుతోందని తెలిపారు. సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రాన్ని కేవలం ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే నడపలేరని.. 10.50 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులే అసలైన సారథులని సీఎం స్పష్టం చేశారు. ఉద్యోగులే ప్రభుత్వానికి వారధులని.. వారి సమస్యల పరిష్కారానికే తాను అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నానన్నారు.

ఉద్యోగుల సంక్షమమే లక్ష్యం

ఉద్యోగుల్లో తనను ఇష్టపడని వారు కూడా ఉండవచ్చని.. అయినా తాను అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల జీతాలు, భత్యాలు ఎలా వస్తున్నాయో అందరూ గమనించాలని సీఎం వ్యాఖ్యానించారు. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఈ కార్యక్రమానికి వచ్చానని చెప్పారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రకటించారు.ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి రూ. 12 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పన్నులు పెంచాల్సిన అవసరం లేదని.. పన్ను వసూళ్లలో అవకతవకలను అరికట్టి సక్రమంగా వసూళ్లు చేస్తే అవసరమైన నిధులు వస్తాయని సీఎం స్పష్టం చేశారు.

జిల్లాల పునర్విభజనకు కమిటీ

జిల్లాల సరిహద్దులు మార్చాలని పలు విజ్ఞప్తులు వస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో త్వరలోనే విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో జిల్లాల పునర్విభజన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఆ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తుందని చెప్పారు.రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదని భావించి మార్చినట్లు పేర్కొన్నారు. అలాగే కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని సీఎం హామీ ఇచ్చారు.మొత్తంగా ప్రభుత్వ ఉద్యోగులే పాలనకు పునాది అని, వారి సంక్షమంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు.

# అర్హత లేని వారి పౌరసత్వాన్ని క్షణాల్లో రద్దు చేస్తా.. ట్రంప్ మరో బాంబ్

వాషింగ్టన్:ట్రంప్.. ఎప్పుడు ఏం మాట్లాడుతాడో ఎవరికీ తెలియదు. అమెరికా ఫస్ట్ నినాదంతో ముందుకెళుతున్న ఈ అధ్యక్షుడు తమ దేశంలోని వారినే కాదు.. ప్రపంచంలోని అందరినీ ఆగమాగం చేస్తున్నాడు. తలతిక్క పనులతో విసుగు తెప్పిస్తున్నారు. వలసవాదులకు రోజుకో నిబంధన.. చర్యలు చేపడుతూ చుక్కలు చూపిస్తున్నాడు. తాజాగా ఇతర దేశం నుంచి వచ్చిన వారిని.. అమెరికన్లను వివాహం చేసుకొని పౌరసత్వం తీసుకున్న వారి అర్హతను ప్రశ్నిస్తూ.. క్షణాల్లో వీసా రద్దు చేస్తానంటూ బాంబు పేల్చారు. ఈ ప్రకటన వలసవాదుల్లో గుబులు రేపుతోంది.అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తనదైన శైలిలో దూకుడు ప్రదర్శిస్తున్న డొనాల్డ్ ట్రంప్ తాజాగా 'సహజీకరణ' ద్వారా పౌరసత్వం పొందిన వారిపై చేసిన వ్యాఖ్యలు అగ్గి రాజేస్తున్నాయి. అర్హత లేని వారి పౌరసత్వాన్ని "క్షణాల్లో రద్దు చేస్తానని" ఆయన హెచ్చరించడం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది.ఇటీవల ద న్యూయార్క్ టైమ్స్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పలు వివాదాస్పద.. కఠినమైన నిర్ణయాలను వెల్లడించారు. పౌరసత్వం పొందే క్రమంలో ఎవరైనా తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా మోసానికి పాల్పడినా వారి పౌరసత్వాన్ని తక్షణమే రద్దు చేస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. సోమాలియా నుంచి వచ్చిన వలసదారుల వల్ల అమెరికా భద్రతకు ముప్పు పొంచి ఉందని ఆయన ఆరోపించారు. అబద్ధాలు చెప్పి పౌరసత్వం పొందిన సోమాలి వంశస్థులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డెమోక్రాటిక్ కాంగ్రెస్‌వుమన్ ఇల్హాన్ ఒమర్‌ను లక్ష్యంగా చేసుకుంటూ ఆమె పౌరసత్వాన్ని రద్దు చేసి సోమాలియాకు పంపాలన్న తన ఆలోచనను ట్రంప్ బయటపెట్టారు.

ఇన్సరెక్షన్ యాక్ట్ ప్రస్తావన

దేశంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అవసరమైతే ఇన్సరెక్షన్ యాక్ట్‌ను ప్రయోగించి సైన్యాన్ని రంగంలోకి దింపడానికి కూడా వెనకాడబోనని ట్రంప్ పేర్కొన్నారు. అధ్యక్షుడికి ఈ విషయంలో విస్తృత అధికారాలు ఉన్నాయని ఆయన



నొక్కి చెప్పారు.

చట్టపరమైన సవాళ్లు

ట్రంప్ వ్యాఖ్యలు వినడానికి కఠినంగా ఉన్నప్పటికీ అమెరికా రాజ్యాంగం ప్రకారం పౌరసత్వాన్ని రద్దు చేయడం అంత సులభం కాదు. పౌరసత్వం రద్దు చేసే అధికారం కేవలం అధ్యక్షుడికే ఉండదు. దీనికి న్యాయస్థానాల అనుమతి తప్పనిసరి. కేవలం రాజకీయ కారణాలతో కాకుండా, తీవ్రమైన నేరపూరిత మోసం నిరూపితమైతేనే రద్దు చేస్తారు. ఇది సుదీర్ఘమైన న్యాయ ప్రక్రియ. క్షణాల్లో రద్దు చేయడం అనేది అమెరికా ప్రస్తుత చట్టాల ప్రకారం అసాధ్యం."దేశాన్ని ప్రేమించే వారే మాకు కావాలి" అన్న ట్రంప్ నినాదం ఆయన మద్దతుదారులను ఉత్సాహపరుస్తున్నప్పటికీ శాశ్వత నివాసితులు .. సహజీకరణ ద్వారా పౌరసత్వం పొందిన భారతీయ అమెరికన్లతో సహా ఇతర దేశస్థుల్లో ఒక రకమైన అభద్రతా భావాన్ని కలిగిస్తోంది. ట్రంప్ హెచ్చరికలు కేవలం మాటలకే పరిమితమవుతాయా లేక చట్ట సవరణల వైపు దారితీస్తాయా అన్నది వేచి చూడాలి.మొత్తంగా ట్రంప్ తాజా వ్యాఖ్యలు అమెరికాలో వలసలు, పౌరహక్కులు అధ్యక్ష అధికారాల పరిమితులపై మరోసారి పెద్ద ఎత్తున చర్చను రేపుతున్నాయి.

# పక్కాగా పనిదినాలు..కూలీ అమలు

హైదరాబాద్, వీబీ జీ రామ్‌జీ ఉపాధి హామీ పథకం మీద కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికత ఉపయోగించామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడంతో పాటు వంద రోజుల పనిదినాలను 125కి పెంచామన్నారు. వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరత లేకుండా.. వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నామన్నారు. వ్యవసాయ సీజన్ లేనప్పుడు 125 పని దినాలు దొరికేలా చూస్తామన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రాలకి అదనపు భారం పడుతుంది. అయితే, కేంద్రం కూడా అదనంగా ఖర్చు పెడుతుంది. కూలీల పేరుతో నకిలీ జాబ్ కార్డులు తయారు చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించడమే ఈ చట్టం ఉద్దేశం. నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశాంఅని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని తీసేశారంటూ బీజేపీపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో గతంలో చాలా అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఒక సంవత్సరం ఒకచోట గుంతలు తవ్వితే మరుసటి ఏడాదీ అదే ప్రాంతంలో తవ్వేవారని విమర్శించారు. దేశంలో అనేక మార్పులు, సంస్కరణలు చేస్తున్నామని.. మార్పులకు అనుగుణంగానే ఉపాధి హామీ పథకం పేరును మార్చామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. వీబీ-జీ రామ్ జీ ద్వారా గోడౌన్‌లు నిర్మించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. అలాగే వ్యవసాయ రంగానికి దీనిని అనుసంధానం చేస్తామని కూడా మంత్రి వివరించారు. పని ఇవ్వలేని పరిస్థితుల్లోనూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఇది కేవలం గుంతలు తవ్వే పథకం కాదు.. దేశాన్ని అభివృద్ధి చేసే పథకం' అని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు.గ్రామ పంచాయతీలకు అమలు అధికారం కల్పించామని, పని దినాలను 100 నుంచి 125కు పెంచామన్నారు మంత్రి.



రాష్ట్రాలకు అదనపు నిధులు వచ్చేలా చేస్తున్నామని వివరించారు. దివ్యాంగులు, వృద్ధులకు కూడా ఉపాధి హామీ కార్డులు ఇస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. భాజపా గాలివాటంతో గెలుస్తుందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గాలివాటం అయితే దేశంలో మూడుసార్లు అధికారంలోకి ఎలా వచ్చామో చెప్పాలన్నారు. మళ్లీ గెలిచి దేశంలో ప్రధానిగా మోదీ అధికారంలోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి చూపించామన్నారు. హిజాబ్ ధరించే మహిళను ప్రధాని చేయాలని మజ్లీస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యల పట్ల కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌కు వెళ్లి బొట్టు పెట్టుకునే హిందువును ప్రధాని చేయాలని ఓవైసీ అడుగుతారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌లో హిందువులు లేకుండా చేశారని, బంగ్లాదేశ్‌లో హిందువులను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో హిందువులు లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదన్నారు. మతాల పేరు మీద రాజకీయాలు నడవవని ఓవైసీ గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు.

# మా ఐదేళ్ల అప్పులు...మీరు 18 నెలల్లో చేశారు

అమరావతి,వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఐదేళ్లలో చేసిన అప్పులతో పోలిస్తే, కూటమి ప్రభుత్వం కేవలం 18 నెలల్లోనే దాదాపు అదే స్థాయి అప్పులు చేసిందని మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అంబటి రాంబాబు ఆరోపించారు. జగన్ హయాంలో మొత్తం ఐదేళ్లలో రూ. 3.32 లక్షల కోట్ల అప్పులు చేస్తే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో 18 నెలల్లోనే రూ. 3.02 లక్షల కోట్ల అప్పులు చేశారని అంబటి రాంబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు అంటే జగన్ హయాంలో చేసిన అప్పుల్లో దాదాపు 90 శాతం అప్పులను కేవలం ఏడాదిన్నరలోనే చేశారని అన్నారు. జగన్ అప్పులు చేస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని చెప్పిన వారు, చంద్రబాబు అప్పులు చేస్తే రాష్ట్రం సింగపూర్ అవుతుందా అంటూ ప్రశ్నించారు. కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 69 వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చిందని, 90 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించగలిగామని అంబటి గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు పెంచమని హామీ ఇచ్చినా, కూటమి ప్రభుత్వ హయాంలోనే దాదాపు రూ. 20 వేల కోట్ల విద్యుత్ భారం ప్రజలపై మోపారని ఆరోపించారు. అలాగే ఎన్నికల హామీలను ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఇక, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు 'టైగర్ ఆఫ్ మార్షల్' అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన అంబటి, ఆయనకు అనేక సామర్థ్యాలు, కళలు ఉన్నాయని ప్రశంసించారు. అయితే పవన్‌ను అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. జనసేన నేతల నెత్తిన ఎక్కి టీడీపీ నేతలు ఆడుకుంటున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బెంగుళూరులో ఉంటూ వైఎస్ జగన్.. కుట్రలు చేస్తున్నారన్న ఆరోపణలపై స్పందించిన అంబటి, జగన్‌కు ఇక్కడే శాశ్వత నివాసం ఉందని తెలిపారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌ల శాశ్వత నివాసాలు ఎక్కడున్నాయో



చెప్పాలని ప్రశ్నించారు. మీరు నదీ గర్భంలో ఉన్న ఇంట్లో ఉంటున్నారు అంటూ విమర్శలు చేశారు. జగన్ ప్రతీ వారం రాష్ట్రానికి వచ్చి ప్రజలతో మమేకమవుతున్నారని తెలిపారు. టీడీపీ నేతలు కడుపు మంటతో మాట్లాడుతున్నారని, జగన్ మాత్రం స్ట్రెయిట్ పాలిటిక్స్ చేస్తారని అన్నారు. డొంక తిరుగుడు రాజకీయాలు జగన్ చేయరని స్పష్టం చేశారు. సత్తెనపల్లిలో ఆరేళ్ల పాటు ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించామని, గత ఏడాది కొన్ని పరిస్థితుల వల్ల చేయలేకపోయామని తెలిపారు. ఈ ఏడాది ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామని, తమ సంక్రాంతి వేడుకలకు పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. మరోవైపు.. దైవాన్ని అడ్డం పెట్టుకుని తుచ్ఛమైన రాజకీయాలు చేస్తున్నారని చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. జగన్‌ను హిందూ వ్యతిరేకిగా ముద్ర వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మీ కుట్రలను వెంకటేశ్వర స్వామి కూడా క్షమించడు అంటూ అంబటి రాంబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# మిగులు జలాలు వాడుకుంటే తెలంగాణకు నష్టం లేదు



అమరావతి, తెలుగు రాష్ట్రాలు సోదరభావంతో అభివృద్ధి చెందాలన్నది ఏపీ సీఎం చంద్రబాబు ఆకాంక్ష అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం – నల్లమల సాగర్‌కు ఎలాంటి అభ్యంతరాలు చెప్పొద్దని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది కూడా 4,600 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిందని గుర్తు చేశారు. పోలవరం దగ్గర వరదనీరు వాడుకోకుంటే నీళ్లన్నీ సముద్రం పాలవుతాయని అన్నారు. గోదావరిలో పుష్కలంగా నీరుందనే కాళేశ్వరానికి మేం అభ్యంతరం చెప్పలేదు. పోలవరం – నల్లమల సాగర్ వల్ల తెలంగాణకు కూడా ఉపయోగం ఉంది. ఏపీకి సరిపోగా నీరు మిగిలితే తెలంగాణ కూడా వాడుకోవచ్చు. అందుకే, పోలవరం – నల్లమల సాగర్ వల్ల తెలంగాణకూ నష్టం లేదని చెబుతూనే ఉన్నాం. సముద్రంలో కలిసే 3 వేల టీఎంసీల్లో 200 టీఎంసీలు వాడుకుంటామన్నాం. గత 50 ఏళ్లలో గోదావరి నుంచి 1.53 లక్షల టీఎంసీలు సముద్రంలో కలిశాయని నిమ్మల వెల్లడించారు. పోలవరం ? నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఓ ట్విస్ట్ వచ్చి చేరింది.. సాంకేతిక కారణాల దృష్ట్యా తన పిటిషన్‌ను ఉపసంహరించు కున్నట్టు పేర్కొంది తెలంగాణ ప్రభుత్వం.. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అధికారికంగా ప్రకటించారు.. అయితే, పోలవరం– నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు పై తెలంగాణ అభ్యంతరాలను సుప్రీంకోర్టు డిస్పోజ్ చేయడంపై స్పందించిన మంత్రి నిమ్మల రామానాయుడు.. కీలక వ్యాఖ్యలు చేశారు.. వృధాగా సముద్రంలో కలుస్తున్న 3 వేల టీఎంసీల నీటిలో 200 టీఎంసీలు మాత్రమే వాడుకుంటామని స్పష్టంగా చెబుతున్నాం.. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎటువంటి నష్టం లేదని ముందు నుండి మేం చెబుతూనే ఉన్నాం అన్నారు..గత ఐదేళ్లలో గోదావరి వరద నీరు 1,53,000 టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలిసింది.. ఈ సంవత్సరం కూడా 4600 టీఎంసీల నీరు వృధాగా సముద్రంలోకి పోయింది. రాష్ట్ర విభజన జరిగిన తరువాత గోదావరి ఎగువన కాళేశ్వరం కు ఏ మాదిరిగా అనుమతి ఇచ్చారో.. ఆ విధంగా దిగువన పోలవరం ? నల్లమల సాగర్ కు అనుమతి ఇవ్వమంటున్నాం. పోలవరం దగ్గర వరద నీరును ఉపయోగించుకుంటే, ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకోవాలి, లేదంటే సముద్రంలో ఉప్పునీటిలో కలిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.. గోదావరిలో పుష్కలంగా నీరు ఉందనే ఆనాడు రాష్ట్ర విభజన తర్వాత కాళేశ్వరాన్ని తెలంగాణ నిర్మాణం చేస్తున్నా, మేం అడ్డుకోలేదు అన్నారు.. పోలవరం ? నల్లమల సాగర్ పూర్తైతే మన రాష్ట్ర ప్రయోజనాలు తీరిన తరువాత నీరు మిగిలితే తెలంగాణకు సైతం ఉపయోగం ఉంటుందని వ్యాఖ్యానించారు ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు..

# టికెట్ రేట్ల పెంపుపై కోమటిరెడ్డి యూటర్న్



హైదరాబాద్,తెలంగాణలో సినిమా టికెట్ ధరల పెంపు వ్యవహారం ఇప్పుడు రాజకీయ రణరంగంగా మారింది. సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, ఆపై తీసుకున్న 'యూటర్న్' ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. తెలంగాణలో గత కొన్ని రోజులుగా 'ది రాజాసాబ్', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి భారీ చిత్రాల టికెట్ ధరల పెంపు చుట్టూ పెద్ద హైడ్రామా నడుస్తోంది. ఈ వివాదంలో స్వయంగా సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇచ్చిన పరస్పర విరుద్ధ ప్రకటనలు ఇప్పుడు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేశాయి.

ఒక్క శనివారం.. ఎన్నో సంచలనాలు!

శనివారం మీడియా ముందు మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి అత్యంత సంచలన వ్యాఖ్యలు చేశారు. " పుష్ప 2 విడుదల సమయంలో జరిగిన తొక్కిసలాట ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. అప్పటి నుండి సినిమా ఇండస్ట్రీని పట్టించుకోవడం మానేశాను" అని స్పష్టం చేశారు. ఇటీవల విడుదలైన సినిమాల టికెట్ రేట్ల పెంపు ఫైళ్లు తన దగ్గరకు రాలేదని.. అసలు ఆ జీవోలు ఎలా జారీ అయ్యాయో తనకు తెలియదని వ్యాఖ్యానించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఒకవైపు మంత్రి తనకు తెలియదంటుంటే, మరోవైపు హైకోర్టు మంత్రి వద్దంటున్నా అధికారులు జీవోలు ఎలా ఇస్తున్నారు? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించడం హాట్ టాపిక్ అయ్యింది.

సోమవారం యూటర్న్.. అసలు క్లారిటీ ఇదే!

అయితే సోమవారం నాటికి మంత్రి కోమటిరెడ్డి మాట మార్చారు. టికెట్ ధరల పెంపు వెనుక ప్రభుత్వ ఉద్దేశాన్ని వివరిస్తూ కొత్త వాదనను తెరపైకి తెచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అందరం కూర్చుని చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. పెరిగిన టికెట్ ధరల లాభాల్లో 20 శాతం వాటాను సినిమా కార్మికుల సంక్షమ నిధికి అందజేయాలనే నిబంధనతోనే ఈ అనుమతులు ఇచ్చామని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎవరి శాఖలోనూ జోక్యం చేసుకోరని.. వైఎస్సార్ గారిలా మంత్రులకు పూర్తి స్వేచ్ఛనిస్తారని పేర్కొంటూ తన శాఖపై తనకే పట్టుందని నిరూపించుకునే ప్రయత్నం చేశారు.

బీఆర్ఎస్‌పై ఘాటు విమర్శలు

ఈ గందరగోళాన్ని ఆసరాగా చేసుకుని విమర్శలు గుప్పించిన బీఆర్ఎస్ నేతలపై కోమటిరెడ్డి విరుచుకుపడ్డారు. ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావును టార్గెట్ చేస్తూ.. "పదేళ్లు అధికారంలో ఉండి ఇప్పుడు ఒక్క ఎంపీ సీటు కూడా గెలవలేకపోయారు. సర్పంచ్ ఎన్నికల్లోనూ అదే పరిస్థితి. ప్రతి చిన్న విషయానికి కాంగ్రెస్‌ను నిందించడం మానుకోవాలి అంటూ కౌంటర్ ఇచ్చారు.

గందరగోళానికి తెరపడినట్లేనా?

మొత్తానికి మంత్రి కోమటిరెడ్డి తన వ్యాఖ్యలను సరిదిద్దుకున్నప్పటికీ ఒకే అంశంపై రెండు రోజుల్లో రెండు రకాలుగా మాట్లాడటం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇది ప్రభుత్వంలోని సమన్వయ లోపమా? లేక వ్యూహాత్మక మార్పా? అన్నది పక్కన పెడితే.. సామాన్య ప్రేక్షకుడు మాత్రం భారీగా పెరిగిన టికెట్ ధరలతో భారానికి గురవుతున్నాడు.

## భూభారతిలో తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగులోకి..

యాదగిరిగుట్ట,భూభారతి చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకుని భూ రిజిస్ట్రేషన్ చలాన్ల ఎడిటింగ్ కుంభకోణంలో అక్రమార్కుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా దాదాపు 120 మంది డాక్యుమెంట్ రైటర్లకు ఈ కుంభకోణంతో ప్రమేయం ఉన్నట్టు తెలుస్తుండగా వీరి సంఖ్యమరింతగా పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. వీరిందరిని జిల్లా రెవెన్యూ అధికారులు పిలిపించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాన్ని వసూలు చేస్తున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. ఇందులో ప్రధాన సూత్రధారుడైన యాదగిరిగుట్ట పట్టణంలోని అశోక భూభారతి రిజిస్ట్రేషన్ కేంద్రాన్ని నడిపిస్తున్న పన్నీరు బస్వరాజుతోపాటు రాజాపేట మండలం చల్లూరుకు చెందిన గణేశ్, బేగంపేటకు చెందిన పాండును గత గురువారం అర్ధరాత్రి వరంగల్ సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.ఆదివారం అర్ధరాత్రి



యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న లక్ష్మీదేవి డాక్యుమెంటేషన్, ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు భానుప్రసాద్, మోటకొండూర్‌కు చెందిన మనుశ్రీ

## బిఆర్ఎస్‌లో చేరిన నర్సంపేట కాంగ్రెస్ నేత

హైదరాబాద్,నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్ద కాలంగా కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న తక్కలపల్లి రవీందర్ రావు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. రవీందర్ రావు పదేళ్లుగా నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్‌గా, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. గతంలో ఆయన రెండుసార్లు ఎంపీపీగా , సింగిల్ విండో చైర్మన్‌గా పనిచేసి నియోజకవర్గంలో మంచి పట్టు సాధించారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు , మోసపూరిత వైఖరిని నిరసిస్తూ, ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ చేరిక నర్సంపేట నియోజకవర్గ రాజకీయాల్లో, ముఖ్యంగా నర్సంపేట

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com